జనసేన మాజీ ఇన్‌చార్జి వినుతకు బెయిల్

చెన్నై, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి :డ్రైవరు కమ్ పీఏ హత్య కేసులో శ్రీకాళహస్తి జనసేన మాజీ ఇన్‌చార్జి కోట వినుతకు బెయిల్ మంజూరైంది.గత నెల 7వ తేదీన డ్రైవరు రాయుడు అలియాస్ శ్రీనివాస్‌ను చంపి మృతదేహాన్ని చెన్నై సమీపంలోని కువ్వా నది కాలువలో పడవేసినట్లు వినుత, ఆమె భర్త చంద్రబాబు సహా మరో ముగ్గురిపై చెన్నై పోలీసులు కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే.ఈ కేసులో వినుతకు చెన్నై కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది.రోజూ ఉదయం 10గంటల్లోపు చెన్నైలోని సెవెన్‌హిల్స్ పోలీసు స్టేషన్‌లో సంతకం చేయాలని కోర్టు షరతు విధించింది.



నూతన విద్యావిధానాన్ని విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

రాష్ట్రంలో ద్విభాషా విధానమే

● ప్లస్-1 పబ్లిక్ పరీక్షల రద్దు ● స్పోకెన్ ఇంగ్లీష్‌పై ప్రత్యేక దృష్టి

● మాతా శిశు సంరక్షణ కేంద్రాలుగా అంగన్‌వాడీలు

చెన్నై, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధిలో అగ్రస్థానంలో ఉన్న రాష్ట్రంలో ద్విభాషా విద్యావిధానమే కొనసాగుతుందని, తమిళం, ఆంగ్ల భాషలపైనే ప్రత్యేక దృష్టి సారిస్తామని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. స్థానిక కోట్టూరుపురంలో అన్నాశతజయంతి స్మారక గ్రంథాలయంలో శుక్రవారం ఉదయం పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన సభలో రాష్ట్ర విద్యావిధాన నివేదికను ఆయన విడుదల చేశారు. దాని ప్రకారం ఈ విద్యా సంవత్సరం నుంచే ప్లస్-1 (11వ తరగతి) పబ్లిక్ పరీక్షలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. స్పోకెన్ ఇంగ్లీషు లాగే స్పోకెన్ తమిళంపై ప్రత్యే దృష్టి సారిస్తామని, అంగన్‌వాడీల పేర్లను మాతా శిశు సంరక్షణ కేంద్రాలుగా మార్చుతున్నామని ఆయన వివరించారు. ఈ సభకు హాజరైన విద్యార్థులను చూస్తుంటే తనకు ఉత్సాహం కలుగుతోందని, వారిని చూసినప్పుడల్లా విద్యావంతులుగా తీర్చిదిద్దాలనే ఆలోచన వస్తోందన్నారు. కొవిడ్ లాక్‌డౌన్ సమయంలో విద్యకు ఆటంకం ఏర్పడకూడదనే 'ఇళ్ల వద్దకే విద్య' అనే పథకాన్ని ప్రవేశపెట్టామని, ఏ రాష్ట్రంలోనూ ప్రతిభావంతులైన, విద్యలో రాణిస్తున్న విద్యార్థులకు సత్కారాలు జరిగిన దాఖలా లేదని, ద్రావిడ తరహా పాలనలోనే విద్యార్థులందరూ ఉన్నత విద్యనభ్యసించాలనే ఆలోచనతో వారిని సత్కరిస్తున్నామన్నారు. రాష్ట్రానికి సంబంధించి నూతన విద్యావిధానాన్ని రూపొందించిన జస్టిస్ మురుగేశన్ కమిటీకి ఈ సందర్భంగా స్టాలిన్ ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో పాఠాలను కంఠస్థం చేయడానికి బదులు వాటిని పూర్తిగా అర్థం చేసుకోగల ప్రతిభావంతులైన విద్యార్థులను తయారు చేసి, విద్యలో నూటికి నూరుశాతం విజయాలను సాధించాలన్నదే తన ఆశయమని స్టాలిన్ పేర్కొన్నారు. విద్యార్థులంతా మాతృభాష తమిళంలోనూ, అనుసంధానభాషగా ఆంగ్లంలో రాణించాలని, ద్విభాషా విద్యావిధానాన్ని మాత్రమే తమ ప్రభుత్వం కొనసాగిస్తుందని, ఈ విషయంలో ఎవరికీ ఎలాంటి అనుమానాలు అక్కర్లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించే పురోగమన వ్యతిరేక చర్యలను ఎట్టి పరిస్థితులలోనూ అనుమతించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు అన్బిల్ మహేష్, ఎం.సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు, కోవి చెళియన్, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ప్రియ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, పాఠశాలల విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఈ నివేదికలోని కీలకమైన అంశాలు

- పాఠశాల విద్యలో తమిళభాషకే ప్రాధాన్యం, ప్రాథమిక స్థాయి నుంచి విశ్వవిద్యాలయాల వరకు తమిళ మాధ్యమానికే అగ్రతాంబూలం
- రాష్ట్రంలో తమిళం, ఆంగ్లభాషలకే ప్రాధాన్యం. ఎప్పటికీ ద్విభాషా విద్యావిధానమే అమలు
- స్పోకెన్ ఇంగ్లీషు తరహాలోనే ప్రాథమిక స్థాయి నుంచి తమిళభాషలో ఉచ్చారణ దోషాలు లేకుండా మాట్లాడేలా శిక్షణ
- 3, 5, 8 తరగతులకు పబ్లిక్ పరీక్షలు నిర్వహించ కూడదు.
- రాష్ట్రంలో నీట్‌కు తావులేదు. అదే సమయంలో నీట్ శిక్షణా కేంద్రాలు అసత్యమైన సమాచారంతో, ఆకర్షణీయ ప్రకటనలపై నిషేధం.
- విద్యను రాష్ట్రజాబితాలో చేర్చాలని కేంద్రంపై ఒత్తిడి
- సీబీఎస్ఈ, స్వయంప్రతిపత్తి కళాశాలల్లో ఫీజుల క్రమబద్ధీకరణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు
- ఐదేళ్ల వయసున్నవారికే ఒకటో తరగతిలో ప్రవేశం
- తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థులకు 1 శాతం రిజర్వేషన్
- అంగన్వాడీ కేంద్రాలను 'మాతా శిశు సంరక్షణ కేంద్రాలు'గా మార్పు
- ఎంజీఆర్, అన్నా, తమిళ విశ్వవిద్యాలయాల్లో పరిశోధక కేంద్రాల ఏర్పాటు
- తమిళ విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడం.
- తమిళ సంఘాలు నిర్వహించే కళాశాల్లో తమిళభాషపై పరిశోధన జరిపేందుకు సరిపడే నిధుల కేటాయింపు
- గ్రామీణ ప్రాంతాల్లోని గిరిజన విద్యార్థులకు క్రీడలకు సంబంధించిన సదుపాయాల పెంపు
- ప్రతి జిల్లాలో ఉపాధ్యాయుల నాయకత్వంలో మాదక ద్రవ్యాల నిరోధక కమిటీల ఏర్పాటు. ఆ కమిటీలో సైక్రియాటిస్టులు, ఆరోగ్యసిబ్బంది, పోలీసులకు సభ్యత్వం.

నూతన విద్యావిధానంలో కీలక అంశాలు...

2022లో ఏర్పాటైన జస్టిస్ మురుగేశన్ కమిటీ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి విశ్వవిద్యాలయాల వైస్‌ఛాన్సలర్లు, విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, ప్రైవేటు విద్యా సంస్థల నిర్వాహకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉన్నత విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల అభిప్రాయాలను సేకరించి నూతన విద్యావిధానాన్ని రూపొందించింది. 650 పేజీలతో కూడిన ఈ విద్యావిధానం 2023 అక్టోబర్‌నాటికి సిద్ధమైంది. అయితే ఆ సమయంలో రాష్ట్రంలో వరదలు, లోక్‌సభ ఎన్నికలు రావడంతో ఆ నివేదిక విడుదల చేయలేకపోయారు. ఆ తర్వాత జూలై 1న జస్టిస్ మురుగేశన్ కమిటీ ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలిసి నివేదికను సమర్పించింది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం ఉదయం ముఖ్యమంత్రి నూతన విద్యావిధానాన్ని అధికారికంగా విడుదల చేశారు.



అరివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలుసుకుని రక్షాబంధన్ సందర్భంగా ఆయనకు రాఖీ కడుతున్న గోపాలపురంలో నివాసం ఉంటున్న మధుబాల కుటుంబీకులు

అత్యవసర పరిస్థితుల్లో ఎన్‌కౌంటర్లను నివారించలేం

● మంత్రి రఘుపతి



పెరంబూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): తప్పనిసరి పరిస్థితుల్లో ఎన్‌కౌంటర్లను నివారించలేమని రాష్ట్ర సహజ వనరులు, న్యాయశాఖ మంత్రి ఎస్.రఘుపతి వ్యాఖ్యానించారు. పుదుకోటలో శుక్రవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో శాంతి భద్రతల విషయమై ప్రతిపక్ష నేత పళనిస్వామి సర్టిఫికెట్ ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్ర ప్రజలు తాము ఆరోగ్యంగా, సురక్షితంగా ఉన్నామని సర్టిఫికెట్ ఇస్తున్నారని, తమకు అది చాలని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. హత్య, దోపిడీలు ఎక్కడ జరిగినా, సత్వరం విచారణ చేపట్టి తప్పు చేసిన వారికి కఠిన శిక్షలు పడేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. పోలీసులు ఒంటరిగా విచారణకు వెళ్లిన సమయంలో సమస్యలు తలెత్తుతున్నాయని, తమ ప్రాణ రక్షణ కోసం వారు కొన్నిసార్లు తీవ్రంగా స్పందించాల్సి వస్తోందన్నారు. అదే సమయంలో ఉత్తరాది రాష్ట్రాల్లో పరిస్థితులు మరీ దారుణంగా ఉన్నాయని మంత్రి తెలిపారు.

స్వగ్రామంలో ఎన్‌కౌంటర్ మృతుడి ఖననానికి నిరసన...

ఎస్ఐను హతమార్చి, ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన నిందితుడు మణికంఠన్ మృతదేహాన్ని స్వగ్రామంలో ఖననం చేసేందుకు గ్రామస్తులు అభ్యంతరం తెలిపారు. తిరుప్పూర్ జిల్లా కుడిమంగళంలో తండ్రీకొడుకుల మధ్య తలెత్తిన ఘర్షణను అడ్డుకొనేందుకు వెళ్లిన స్పెషల్ ఎస్ఐ షణ్ముగవేల్‌పై ఆ ముగ్గురూ దాడిచేసి హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో తండ్రి మూర్తి, చిన్నకుమారుడు పాండి పోలీసుల ఎదుట లొంగిపోగా, ఉడుమలైపేట సమీపంలో పెద్ద కుమారుడు మణికంఠన్ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు. తిరుప్పూర్ ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం బంధువులకు మృతదేహం అప్పగించగా, వారు స్వగ్రామం నాయకనూరుకు తీసుకెళ్లారు. కానీ, మృతదేహాన్ని గ్రామంలో ఖననం చేసేందుకు గ్రామస్తులు అభ్యంతరం తెలిపారు. దీంతో కుటుంబీకులు మణికంఠన్ మృతదేహాన్ని తిరుప్పూర్ దహనవాటికకు తీసుకెళ్లి అంత్యక్రియలు పూర్తి చేశారు.

మరణంలోనూ వీడని స్నేహం

● రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మిత్రుల మృతి

పెరంబూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కళ్లకుర్చి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. చిన్నసేలం రైల్వే గేట్ సమీపంలో ద్విచక్రవాహనాన్ని లోడ్ వ్యాన్ ఢీకొనడంతో ముగ్గురు యువకులు మృతిచెందారు. కళ్లకుర్చి జిల్లా పాండియన్ కుప్పం గ్రామానికి చెందిన దినేష్‌కుమార్ (25)కీర్తన దంపతులకు రెండు నెలల క్రితం మగబిడ్డ జన్మించాడు.. ప్రస్తుతం కీర్తన చిన్నసేలం సమీపంలోని మావానత్తం గ్రామంలో కన్నవారింట్లో ఉంది. కుమారుడిని చూసేందుకు దినేష్‌కుమార్, తన స్నేహితులు వెంకటేశన్ (23), శివశక్తి (36)తో కలసి మావానత్తం గ్రామానికి వెళ్లాడు. కుమారుడిని చూసిన అనంతరం ముగ్గురు ద్విచక్రవాహనంపై గురువారం రాత్రి పాండియన్ కుప్పం బయల్దేరాడు. చిన్నసేలం రైల్వే గేట్ సమీపంలో వీరి బైక్‌ను ఎదురుగా వచ్చిన సరకుల లోడ్ వ్యాన్ ఢీకొంది. ఈ ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న చిన్నసేలం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించి, కేసు నమోదుచేసి పరారీలో ఉన్న వ్యాన్ డ్రైవర్ కోసం గాలిస్తున్నారు.



మృతులు దినేష్ కుమార్, శివశక్తి, వెంకటేశన్ (ఫైల్‌ఫోటోలు)

● ఎంజీఆర్ సెంటిమెంట్
4777 కారు నెంబరుతో నయినార్ నాగేంద్రన్ ప్రచారరథం

ప్యారీస్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): తమిళ చిత్ర పరిశ్రమ, రాజకీయ రంగంలో చక్రం తిప్పి రాష్ట్ర ప్రజల గుండెల్లో చెరగని ముద్రవేసుకున్న అన్నాడీఎంకే వ్యవస్థాకులు, దివంగత ముఖ్యమంత్రి ఎంజీఆర్ ఉపయోగించిన కారు రిజిస్ట్రేషన్ నెంబరుతో ఉన్న కొత్తకారులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ రాష్ట్రవ్యాప్తంగా పర్యటించనున్నారు. వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికలకు అన్ని రాజకీయ పార్టీలు సమాయత్తమవుతున్నాయి. ఇప్పటికే అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ప్రచారయాత్ర ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, రాష్ట బీజేపీ తరుపున నయినార్ నాగేంద్రన్ బూత్ కమిటీల బలోపేతానికి దృష్టిపెట్టారు. ఇప్పటికే ఆయన తిరునల్వేలి, తెన్‌కాశి, తూత్తుకుడి, కన్నియాకుమారి, విరుదునగర్ జిల్లాల్లోని 30 అసెంబ్లీ నియోజకవర్గాల్లో బూత్ కమిటీలను నియమించారు. ఈ నెల 17వ తేదీన తిరునల్వేలిలో నిర్వహించనున్న మహానాడులో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్రహోంశాఖ మంత్రి అమిత్‌షా, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పాల్గొంటారని నయినార్ నాగేంద్రన్ తెలిపారు. ఈ నేపథ్యంలో, రాష్ట్రంలోని 38 జిల్లాల్లో పర్యటించాలని నిర్ణయం తీసుకున్న ఆయన ప్రత్యేకంగా ఓ కారు కూడా సిద్ధం చేసుకున్నారు. అరియలూరు జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు అయ్యప్పన్ సహకారంతో ఎంజీఆర్ కారు నెంబర్ 4777 నయినార్ నాగేంద్రన్ కారుకు కూడా ఆర్టీఏ అధికారి నుంచి పొందారు. టీఎన్ 61ఏకే 4777 అనే నెంబర్ గల కారును ఆయన గురువారం తిరునల్వేలి వెళ్లి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆ కారుకు బీజేపీ జెండా కట్టి తన మద్దతుదారులతో కొంతదూరం ప్రయాణించారు. నయినార్ నాగేంద్రన్ అన్నాడీఎంకే సభ్యుడిగా ఉన్నప్పటి నుండి ఎంజీఆర్ వీరాభిమాని. తన సెల్‌ఫోన్ కాలర్‌ట్యూన్‌గా ఎంజీఆర్ నటించిన ఉంగళ్ వీట్టు పిళ్లై అనే పాట వాడుతున్నారు. బీజేపీలో చేరి పదేళ్లు దాటుతున్న ఇప్పటికీ ఆ పాటే కాలర్‌ట్యూన్‌గా ఉంచుకోవడం గమనార్హం.



ప్రచార రథంపై బీజేపీ జెండా కడుతున్న నయినార్ నాగేంద్రన్

బాణసంచా కార్మికులకు కాంక్రీట్ ఇళ్లు

● అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామి హామీ

ప్యారీస్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే అధికారంలోకి వచ్చిన వెంటనే బాణసంచా కార్మికులకు కాంక్రీట్ గృహాలు నిర్మించి ఇస్తామని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి హామీ ఇచ్చారు. శివకాశి సమీపంలోని నారాయణపురంలో బాణసంచా కర్మాగారాన్ని పళనిస్వామి శుక్రవారం పరిశీలించారు. అందులో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అన్నాడీఎంకే అధికారం చేపట్టిన వెంటనే బాణసంచా కార్మికులు సహా పేదలకు ఇళ్లు నిర్మించి అందజేస్తామని హామీ ఇచ్చారు. అలాగే, బాణాసంచా పరిశ్రమ సజావుగా, సురక్షితంగా నడిచేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని పళనిస్వామి తెలిపారు.



కార్మికురాలితో మాట్లాడుతున్న ఈపీఎస్

రాష్ట్రంలో సుప్రీంకోర్టు ఉంటే మరోలా తీర్పు: పళనిస్వామి

ఢిల్లీలో సుప్రీంకోర్టు ఉండడంతో, అక్కడ నెలకొన్న వాతావరణ కాలుష్యాన్ని పరిగణనలోకి తీసుకుని బాణసంచా కేసులో తీర్పు ఇచ్చారని, రాష్ట్రంలో సుప్రీంకోర్టు ఉంటే తీర్పు మరోలా ఉండేదని ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి వ్యాఖ్యానించారు. 'మక్కలై కాప్పోం...తమిళగత్తై మీట్పోం' ప్రచార కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శివకాశి తాలూకా బాణసంచా, అగ్గిపెట్టె, క్యాలెంటర్ల ఉత్పత్తిదారులు, ప్రింటింగ్ ప్రెస్ యజమానులు, పేపర్ మార్ట్ వ్యాపారులతో పళనిస్వామి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బాణసంచా కేసు న్యాయస్థానంలో ఉన్నందున ప్రభుత్వం పరిమిత స్థాయిలో మాత్రమే వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. సుప్రీంకోర్టు ఢిల్లీలో ఉన్నందున, అక్కడి వాతావరణ కాలుష్యం పరిగణలోకి తీసుకుని తీర్పు ఇచ్చిందని, ప్రస్తుతం రాష్ట్రానికి చెందిన వ్యక్తి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉండడంతో మంచి తీర్పు వస్తుందనే నమ్మకం ఉందన్నారు. శివకాశిలో రూ.10 కోట్లతో అగ్నిప్రమాద బాధితులకు ప్రత్యేక చికిత్స యూనిట్, విరుదునగర్‌లో రూ.350 కోట్లతో ప్రభుత్వ వైద్యకళాశాల ఏర్పాటుచేశామన్నారు. మాజీ మంత్రులు కేటీ రాజేంద్ర బాలాజీ, ఆర్బీ ఉదయకుమార్, కామరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అన్బుమణి సమావేశానికి హైకోర్టు గ్రీన్‌సిగ్నల్

● తండ్రీకొడుకులతో రెండుసార్లు మాట్లాడిన న్యాయమూర్తి

చెన్నై, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పీఎంకే వ్యవస్థాపకులు డాక్టర్ రాందాస్, ఆయన కుమారుడు డాక్టర్ అన్బుమణి మధ్య నెలకొన్న ఆధిపత్యపోరుకు మద్రాస్ హైకోర్టు పరోక్షంగా పరిష్కారం చూపింది. అన్బుమణి శనివారం మహాబలిపురంలో నిర్వహించతలపెట్టిన సర్వసభ్యమండలి సమావేశానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆ సమావేశాన్ని అడ్డుకోవాలంటూ పార్టీ వ్యవస్థాపకులు దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. అవసరమైతే రాందాస్ మళ్లీ సివిల్ కోర్టును ఆశ్రయించవచ్చని సూచించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆనంద్ వెంకటేష్ శుక్రవారం రాత్రి తీర్పు వెలువరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇరువర్గాల న్యాయవాదుల వాదోపవాదనల్ని, తండ్రీకొడుకుల ప్రత్యక్ష అభ్యర్థనల్ని ఆలకించిన అనంతరం న్యాయమూర్తి ఈ మేరకు స్పష్టత ఇచ్చారు. దీంతో పీఎంకే పగ్గాలు భవిష్యత్తులో ఎవరి చేతికి వెళ్తాయన్నదానిపై పరోక్షంగా తేలిపోయినట్లేనని రాజకీయవర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. పార్టీ నిర్వహణ వ్యవహారంలో తండ్రీకొడుకుల మధ్య పొరపొచ్చాలు ఏర్పడిన విషయం తెలిసిందే. దాంతో పార్టీ అధ్యక్ష పదవి నుంచి అన్బుమణిని తొలగిస్తున్నట్లు రాందాస్ గతంలో ప్రకటించారు. అప్పటి నుంచి తిరుగుబాటుగా ప్రకటించకపోయినప్పటికీ.. పార్టీపై పూర్తిగా పట్టు సాధించేందుకు అన్బుమణి చేయాల్సినదంతా చేసుకుంటూ పోతున్నారు. ఇందులో భాగంగా శనివారం మహాబలిపరంలో సర్వసభ్యమండలి సమావేశం నిర్వహించనున్నట్లు అన్బుమణి ప్రకటించిన విష యం తెలిసిందే. అయితే ఆ సమావేశాన్ని అడ్డుకోవాలని అభ్యర్థిస్తూ డాక్టర్ రాందాస్ హైకోర్టును ఆశ్రయించగా, శుక్రవారం న్యాయమూర్తి జస్టిస్ ఆనంద్ వెంకటేష్ ముందు విచారణ జరిగింది.

ఉదయం నుంచే హైడ్రామా: శుక్రవారం ఉదయమే ఈ పిటిషన్ విచారణకు రాగా అన్బుమణి, రాందాస్ సాయంత్రంలోగా హైకోర్టుకు రావాలని, సాయంత్రం తన ఛాంబర్‌లో విచారణ జరుపుతానని జస్టిస్ ఆనంద్ వెంకటేష్ ఇరుతరఫు న్యాయవాదులకు ముందుగా చెప్పారు. ఈ విషయాన్ని న్యాయవాదులు తండ్రీకొడుకులకు తెలిపారు. అన్బుమణి సాయంత్రం 5.15 గంటలకు హైకోర్టుకు చేరుకున్నారు. తాను కూడా హైకోర్టుకు వస్తానంటూ ముందు చెప్పిన రాందాస్.. ఆ తరువాత అనారోగ్యం కారణంగా రాలేనంటూ.. తైలాపురం గార్డెన్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరయ్యారు. సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభమైన విచారణ 6.30 గంటల వరకు కొనసాగింది. అన్బుమణి తన వాదనలను న్యాయమూర్తికి వివరించారు, సర్వసభ్యమండలి ద్వారా పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన తనను ఆ పదవి నుండి తొలగించే అధికారం పార్టీ వ్యవస్థాపకుడు రాందాస్ కు కూడా లేదని, అందుకే తాను శనివారం సర్వసభ్యమండలి సమావేశానికి పిలుపునిచ్చానని, ఏర్పాట్లు కూడా పూర్తయ్యాయని వివరించారు. తానే పార్టీని ఏర్పాటు చేశానని, పార్టీపై సర్వహక్కులు తనవేనని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరైన రాందాస్ వివ రించారు. ఇరువురి వాదనలను న్యాయమూర్తి రాతపూర్వకంగా నమోదు చేసుకున్నారు. విచారణ పూర్తికాగానే అన్బుమణి బయటకు వెళ్లిపోయారు. అయితే కాసేపటికే అన్బుమణి తన ఎదుట హాజరు కావాలంటూ న్యాయమూర్తి ఆదేశించడంతో.. ఆయన హడావుడిగా రాత్రి 7 గంటల ప్రాంతంలో ఛాంబర్‌కు వచ్చారు. మళ్లీ ఆయన వాదనలపై స్పష్టత తీసుకున్న న్యాయమూర్తి.. అన్బుమణి సర్వసభ్యమండలి సమావేశానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.



న్యాయమూర్తి ఛాంబర్‌లోకి వెళ్తున్న అన్బుమణి

సమాచార దృష్టి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా పుళల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. జవహర్ నగర్, కామరాజ్ నగర్, పడియనల్లూర్ పరిసర ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

యునానీ, సిద్ధ కోర్సుల దరఖాస్తు గడువు పొడిగింపు

పెరంబూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సిద్ధ, ఆయుర్వేద, యునానీ, హోమియోపతి కోర్సుల్లో ప్రవేశాలకు www.tnhealth.tn.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా గత నెల 24న దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమై గురువారం (ఈ నెల 7వ తేది)తో ముగిసింది. విద్యార్థులు, తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు దరఖాస్తు గడువు ఈ నెల 14వ తేది వరకు పొడిగించినట్లు ఆరోగ్య శాఖ తెలిపింది.

నేడు మెట్రోవాటర్ బోర్డు గ్రీవెన్స్

పెరంబూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): చెన్నై మెట్రోవాటర్ బోర్డు ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు గ్రీవెన్స్ జరుగనుంది. నగరంలోని అన్ని మెట్రోవాటర్ బోర్డు కార్యాలయాల ప్రాంగణంలో పర్యవేక్షణాధికారి నేతృత్వంలో జరుగనున్న ఈ గ్రీవెన్స్‌లో... తాగునీరు, మురుగునీటి సమస్యలు, పన్నుల బకాయిలు, పెండింగ్‌లో ఉన్న కొత్త కనెక్షన్లు తదితరాలకు పరిష్కారం పొందవచ్చని వాటర్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

13న డీఎంకే జిల్లా కార్యదర్శుల సమావేశం

పెరంబూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): డీఎంకే జిల్లా కార్యదర్శుల సమావేశం ఈ నెల 13న జరుగనుంది. ఈ మేరకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మంత్రి దురైమురుగన్ విడుదల చేసిన ప్రకటనలో.... పార్టీ అధ్యక్షుడు స్టాలిన్ నేతృత్వంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు తేనాంపేటలోని అన్నా అరివాలయం ప్రాంగణం కలైంజర్ ఆడిటోరియంలో జిల్లా కార్యదర్శుల సమావేశం జరుగనుంది. సమావేశంలో 'ఏకతాటిపై తమిళనాడు -సభ్యుల చేరిక'పై చర్చించనున్నట్లు, సమావేశానికి జిల్లా కార్యదర్శులు అందరూ హాజరుకావాలని దురైమురుగన్ ప్రకటనలో తెలిపారు.

ట్రెక్కింగ్ ఛార్జీల్లో 30 శాతం రాయితీ

పెరంబూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 14 జిల్లాల్లో 40 అటవీ ప్రాంతాల్లో 'ట్రెక్కింగ్' వెళ్లేందుకు ప్రభుత్వం గత ఏడాది అనుమతించింది. ఈ ప్రకారం, 14 సులభమైన ప్రాంతాలు, 14 మధ్యస్థ ప్రాంతాలు, 12 కష్టతరమైన ప్రాంతాలుగా విభజించి, ఆయా ప్రాంతాల స్థానికులు, గిరిజన యువకులను గైడ్లుగా నియమించారు. ట్రెక్కింగ్ వెళ్లేందుకు ఆసక్తి ఉన్న వారు https://www.trektamilnadu.com/ అనే వెబ్‌సైట్‌లో పేరు నమోదుచేసుకోవచ్చు. ట్రెక్కింగ్ ఫీజుగా ఆయా ప్రాంతాలను బట్టి రూ.700 నుంచి రూ.5,999గా నిర్ణయించారు. ఈ నేపథ్యంలో, ట్రెక్కింగ్ ఫీజు అధికంగా ఉండడంతో ఆసక్తికలిగినవారు వెళ్లేందుకు రావడంలేదని భావించిన అధికారులు, ట్రెక్కింగ్ ఫీజులో 30 శాతం రాయితీ కల్పించారు. ఉదాహరణకు, కొడైకెనాల్-కుంబక్కరై 'క్యాంప్' ప్రయాణానికి రూ.3,799 వసూలుచేస్తున్న ఫీజు, ప్రస్తుతం రూ.2,999కి తగ్గిందని, అలాగే, ఇతర ప్రాంతాల ఫీజు కూడా తగ్గినట్లు అధికారులు తెలిపారు.

వివేకానంద రాక్‌కు ఆన్‌లైన్‌లో టిక్కెట్లు

పెరంబూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి సమీపంలోని వివేకానంద రాక్‌కు పడవలో వెళ్లేందుకు ఆన్‌లైన్ టిక్కెట్ సదుపాయం శుక్రవారం నుంచి అమలులోకి వచ్చింది. కన్నియాకుమారి సముద్రం మధ్యలో స్వామి వివేకానంద స్మారక మండపం, దాని సమీపంలోని 133 అడుగుల తిరువళ్లువర్ విగ్రహం నిర్మించారు. సముద్రంలో మధ్యలో ఉన్న ఈ మండపం, విగ్రహం వీక్షించేందుకు ప్రతిరోజు వేలాది మంది పర్యాటకులు పడవలో వెళ్తుంటారు. ఈ ప్రాంతానికి వెళ్లేందుకు పుంపుహార్ నౌక సంస్థ పడవలు నడుపుతోంది. అలాగే, వివేకానంద స్మారక మండపం-తిరువళ్లువర్ విగ్రహం మధ్య ఏర్పాటుచేసిన అద్దాల వంతెన కొద్ది నెలల క్రితం పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ క్రమంలో, కన్నియాకుమారి వివేకానంద రాక్‌కు పడవలో వెళ్లేందుకు శుక్రవారం నుంచి ఆన్‌లైన్ టిక్కెట్ విధానం ప్రారంభించారు. ఇప్పటివరకు కౌంటర్లలో మాత్రమే టిక్కెట్లు అందిస్తుండగా, https://www.psckfs.tn.gov.in/ అనే వెబ్‌సైట్‌లో కూడా టిక్కెట్లు రిజర్వేషన్ చేసుకునే వసతి కల్పించినట్లు అధికారులు తెలిపారు.

పాఠశాల విద్యార్థులకు ఈ-మెయిల్ చిరునామా

పెరంబూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థులు ఈ-మెయిల్ చిరునామా ప్రారంభించాలని ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ అయ్యాయి. తమిళనాడు నైపుణ్యాభివృద్ధి సంస్థ అందించే ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు, ఉన్నత విద్య, పోటీ పరీక్షల దరఖాస్తు తదితరాలకు ప్రతి విద్యార్థికి ఈ-మెయిల్ చిరునామా అవసరం. అందువల్ల, గత ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో 9 నుంచి ప్లస్ టూ తరగతి చదివే విద్యార్థులకు ఈ-మెయిల్ చిరునామా ప్రారంభించాలని ఉపాధ్యాయులకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆ ప్రకారం, ఈ ఏడాది కూడా 9 నుంచి ప్లస్ టూ చదివే విద్యార్థులకు, గత ఏడాది ఈ-మెయిల్ ప్రారంభించని 10 నుంచి ప్లస్ టూ వరకు విద్యార్థులకు పాఠశాలల్లోనే ఈ-మెయిల్ చిరునామా సృష్టించాలని ఆదేశించారు. ఈ-మెయిల్ చిరునామా 'ఎమిస్' వెబ్‌సైట్‌లో నమోదుచేయాలని, ఈ-మెయిల్ వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ప్రధానోపాధ్యాయులకు పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది.

వైభవంగా వరలక్ష్మీ వ్రతం

● ఆలయాల్లో పోటెత్తిన భక్తజనం

వేలూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని వేలూరు జిల్లావ్యాప్తంగా అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునుండే ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. ఈ సందర్భంగా వేలూరు కొత్త బస్టాండు సమీపంలోని చెల్లియమ్మన్ ఆలయంలో శుక్రవారం ఉదయం మహిళలు ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అర్చకులు అమ్మవారికి అభిషేకం చేసి, బంగారు ఆభరణాలతో అలంకరించారు. అదేవిధంగా పళ్ళకొండలోని ఎల్లయమ్మన్ ఆలయంలో కూడా అర్చకులు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. శ్రీపురంలోని నారాయణి పీఠంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు జరిగాయి. ఆలయాల భద్రతా ఏర్పాట్లను దేవాదాయశాఖ జిల్లా జాయింట్ కమిషనర్ అనిత, ఉప కమిషనర్ కరుణానిధి, అసిస్టెంట్ కమిషనర్ శంకర్ తదితరులు పర్యవేక్షించారు. ఆలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పోలీసులు పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.




విశేషాలంకరణలో అమ్మవారు - హారతి ఇస్తున్న అర్చకుడు

రాజధాని నగరంలో తొలిసారి ఏసీ విద్యుత్ బస్సు

● 11న ప్రారంభించనున్న సీఎం

పెరంబూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలో మొట్టమొదటి ఏసీ విద్యుత్ బస్సు సేవలు సోమవారం (ఈ నెల 11వ తేది) ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించనున్నట్లు ఎంటీసీ మేనేజింగ్ డైరెక్టర్ ప్రభు శంకర్ తెలిపారు. డీజిల్‌తో నడిచే బస్సులకు ప్రత్యామ్నాయంగా, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా సీఎన్జీ, విద్యుత్ బస్సులు నడిపేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆ ప్రకారం, ఎంటీసీ ఆధ్వర్యంలో ఒప్పంద ప్రాతిపదికన ఐదు డిపోల నుంచి 625 విద్యుత్ బస్సులు ప్రారంభించాలని నిర్ణయించారు. తొలివిడతగా వ్యాసర్పాడి బస్ డిపో నుంచి 120 విద్యుత్ బస్సులను జూన్ 30వ తేది సీఎం స్టాలిన్ ప్రారంభించారు. రెండో విడతగా పెరుంబాక్కం డిపో నుంచి 50 ఏసీ, 80 నాన్ ఏసీ విద్యుత్ బస్సు సేవలు ప్రారంభం కానున్నాయని, త్వరలో మిగిలిన డిపోల నుంచి విద్యుత్ బస్సులు ప్రారంభించనున్నట్లు ఎంటీసీ ఎండీ ప్రభుశంకర్ తెలిపారు.

అన్నాడీఎంకే కూటమిలోనే డీఎండీకే

● మాజీ మంత్రి కేసీ వీరమణి

చెన్నై, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే కూటమిలోనే డీఎండీకే కొనసాగుతుందని మాజీ మంత్రి కేసీ వీరమణి ప్రకటించారు. శుక్రవారం ఉదయం తిరుపత్తూరులో ప్రచారం చేస్తున్న డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలతను ఆయన కలుసుకున్నారు. సుమారు అరగంటకు పైగా వారిద్దరూ సమావేశమయ్యారు. అనంతరం వీరమణి మీడియాతో మాట్లాడుతూ అన్నాడీఎంకే కూటమిలో కొనసాగటానికే డీఎండీకే నాయకులంతా ఆసక్తి కనబరుస్తున్నారని, వచ్చే యేడాది జరుగనున్న ఎన్నికల్లో బలమైన కూటమిని ఏర్పాటు చేసుకుని బరిలోకి దిగి అవినీతి డీఎంకే ప్రభుత్వాన్ని తరిమికొట్టాల్సిన అవసరం ఉందన్నారు.

అమెరికా వెళ్లేందుకు సెంథిల్ బాలాజి సోదరుడికి అనుమతి

ప్యారీస్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి సెంథిల్ బాలాజీ సోదరుడు అశోక్‌కుమార్ వైద్యం కోసం అమెరికా వెళ్లేందుకు మద్రాస్ హైకోర్టు శుక్రవారం నిబంధనలతో కూడిన అనుమతి మంజూరు చేసింది. అశోక్‌కుమార్ గుండె ఆపరేషన్ అమెరికా వెళ్లేందుకు అనుమతి కోరుతూ దాఖలు చేసిన పిటిషన్ గతంలో విచారణకు రాగా ఈడీ పరిశీలించి నివేదిక దాఖలు చేయాల్సినదిగా న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది. ఈ నేపథ్యంలో శుక్రవారం మళ్లీ పిటిషన్ హైకోర్టు న్యాయమూర్తులు ఎంఎస్ రమేష్, వి.లక్ష్మీనారాయణన్ బెంచ్ ముందుకు విచారణకు రాగా ఈడీ తరుపున హాజరైన న్యాయవాది జాబితా దాఖలు చేశారు. దీనిని పరిశీలించిన న్యాయస్థానం విచారణ కోర్టులో రూ.5లక్షలు డిపాజిట్ చేయాలని, కుమార్తె పాస్‌పోర్టు అప్పగించాలని తదితర నిబంధనలు విధించి అశోక్‌కుమార్ అమెరికా వెళ్లేందుకు అనుమతి మంజూరు చేసింది.

నెల్లూరు బస్టాండులో 2 కిలోల గంజాయి స్వాధీనం

● ఇద్దరి అరెస్టు.. మరో ఇద్దరి పరారీ
● నిందితులు చెన్నైవాసులు

నెల్లూరు(క్రైం), ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు ఆర్టీసీ బస్టాండులో గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు చిన్నబజారు పోలీసు స్టేషన్ సీఐ కోటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాకు వెల్లడించిన వివరాలిలా.. చెన్నైకి చెందిన నాగప్పన్ మణికంఠ, ఓ బాలుడు మద్యం, గంజాయికి బానిసలయ్యారు. వారి వ్యసనాలకు అవసరమైన నగదు కోసం గంజాయి విక్రయిస్తున్న చెన్నై సెంట్రల్‌కు చెందిన సూర్య, ఎలన్ జరీయన్‌ను సంప్రదించారు. నలుగురు కలిసి ఈ నెల 7వ తేదీ నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌లో నెల్లూరు జిల్లాలోని కావలి చేరుకున్నారు. అక్కడ గుర్తుతెలియని వ్యక్తి నుంచి రెండు కిలోల గంజాయి కొనుగోలు చేసి ఆర్టీసీ బస్సులో నెల్లూరు చేరుకుని, ఇక్కడి నుంచి చెన్నై వెళ్లేందుకు వేచి ఉన్నారు. ఈ సమాచారంతో ఎస్ఐ అయ్యప్ప సిబ్బందితో ఆర్టీసీ బస్టాండుకు వెళ్లగా పోలీసు జీపును చూసి నిందితులు పరారయ్యారు. వారిని వెంబడించి నాగప్పన్ మణికంఠ, బాలుడిని పట్టుకోగా మరో ఇద్దరు పారిపోయారు. నిందితుల బ్యాగుల్లోని రెండు కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మణికంఠను అరెస్ట్ చేయగా, బాలుడిని జువైనల్ హోమ్‌కు తరలించారు. మిగిలిన ఇద్దరు నిందితుల కోసం గాలిస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



అన్నానగర్‌లోని తన నివాసంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతం చేస్తున్న తెలుగు పారిశ్రామిక వేత్త శోభారాజా. ఈ కార్యక్రమానికి పలువురు తెలుగు ప్రముఖులు హాజరయ్యారు.

వ్యవసాయ భూముల్లో ప్లాటా?

● సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద రైతుల ధర్నా



రైతు సంఘం నాయకుడు అయ్యాకన్ను ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

చెన్నై, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూములకు నకిలీ పట్టాలిచ్చి, వాటిలో ఇళ్ల ప్లాట్లు వేస్తున్నారని, దానిని అడ్డుకోవాలని రైతు సంఘం నాయకుడు అయ్యాకన్ను డిమాండ్ చేశారు. తిరుచ్చి జిల్లా కలెక్టరేట్ వద్ద సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని శుక్రవారం ఉదయం రైతులు ముట్టడించారు. సబ్ కలెక్టర్ అరుళ్ రైతు సమస్యలపై వినతి పత్రాలను స్వీకరించారు. ఆ సందర్భంగా రైతు సంఘం నాయకుడు అయ్యాకన్ను చిన్న సూరియూరు ప్రాంతానికి చెందిన వందమంది రైతులతో వచ్చి తిరుచ్చి ఉరయూరు చిన్నసెట్టి వీధిలో ఓ ఆలయానికి చెందిన భూములను కబ్జాచేసి రియల్‌ఎస్టేట్ వ్యాపారులు హౌసింగ్ ప్లాట్లను నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆరోపించారు. అంతటితో ఆగకుండా సబ్‌కలెక్టర్ కార్యాలయం తలుపులకు తాళం వేసి ధర్నా జరిపారు. సమాచారం అందుకుని పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని రైతులను అక్కడి నుండి తొలగించారు. సబ్ కలెక్టర్ కార్యాలయ తలుపులకు వేసిన తాళాన్ని పగులగొట్టి తెరిచారు.

భారీ వర్షాలకు నీట మునిగిన అరటి



అరటి గెలలను దోనెపై తరలిస్తున్న రైతు

చెన్నై, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా భవానీసాగర్ పరిసర ప్రాంతాల్లో గత కొద్ది రోజులుగా కురిసిన భారీ వర్షాలకు కోతకు సిద్ధంగా ఉన్న అరటితోటలు నీటమునిగాయి. దీనితో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. భవానీసాగర్ జలాశయం నుండి కూడా అదనపు జలాలు విడుదల కావటంలో ఆ నీరంతా వచ్చి అరటి తోటలను ముంచెత్తినట్లు రైతులు చెబుతున్నారు. చిత్తన్ కుట్టై, జేజే నగర్, పుదుక్కాడు, కన్రాముక్కై ప్రాంతంలో కదళి, నేంద్రం రకానికి చెందిన అరటి తోటలు నీటమునిగాయి. దీంతో రైతులు దోనెల్లో వెళ్లి అరటి గెలలను కోసేందుకు ప్రయత్నిస్తున్నారు.

విద్యార్థినులు క్రీడల్లోనూ రాణించాలి



విజేతలకు సర్టిఫికెట్లు అందిస్తున్న నిర్వాహకులు

వేలూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వేలూరు సమీపంలోని కాట్పాడిలో వోఎస్‌వైఎక్స్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థినులకు బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. 6 నుంచి 10వ తరగతి వరకు నిర్వహించిన ఈ పోటీల్లో వంద మందికి పైగా విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమానికి వీఐటీ ఉప ఛాన్స్‌లర్ జీవీ. సెల్వం అధ్యక్షత వహించగా, జిల్లా ఎస్పీ మయిల్‌వాహనం ముఖ్యఅతిథిగా హాజరై పోటీలు ప్రారంభించారు. అనంతరం విజేతలకు నిర్వాహకులు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

పుదువై రవాణా సంస్థ ఉద్యోగుల సమ్మె విరమణ

● పది రోజుల తరువాత కదిలిన బస్సులు



కార్మిక సంఘ ప్రతినిధులతో చర్చల్లో పాల్గొన్న సీఎం రంగస్వామి

పుదుచ్చేరి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి ప్రభుత్వ రవాణా సంస్థ ఉద్యోగులు గత నెల 28వ తేదీ నుండి చేపట్టిన సమ్మె విరమించుకుంటున్నట్లు శుక్రవారం ప్రకటించారు. పుదుచ్చేరి పీఆర్‌టీసీలో 15యేళ్లకు పైగా పనిచేస్తున్న కంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరుతూ 7వ పే కమిషన్ ప్రతిపాదన అమలుపరచాలనే డిమాండ్లు నెరవేర్చని కారణంగా గత నెల 28 నుంచి నిర్వదిక సమ్మెలో పాల్గొనడంతో 12 రోజులుగా ప్రభుత్వ బస్సులు డిపోకే పరిమితమమయ్యాయి. దీంతో రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ద్వారా నాలుగు విడతలుగా రవాణా సంస్థ ఉద్యోగుల ప్రతినిధులతో చర్చలు జరిగాయి. చివరగా ముఖ్యమంత్రి రంగస్వామితో శుక్రవారం ఉదయం పుదుచ్చేరి అసెంబ్లీ ప్రాంగణంలో నిర్వహించిన చర్చల్లో స్పీకర్ ఎంబళం సెల్వం, ప్రతిపక్షనేత శివ, ఎమ్మెల్యే నెహ్రూతో పాటు ప్రభుత్వ గుర్తింపు పొందిన కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఇందులో కాంట్రాక్ట్ కార్మికుల వేతనం రూ.10వేలకు పెంపు, పర్మినెంట్ ఉద్యోగులకు డీఏ పెంపునకు రాష్ట్రప్రభుత్వం అంగీకరించింది. ఈ చర్చలు సఫలం కావడంతో సాయంత్రం 4 గంటల నుంచి ఉద్యోగులు విధులకు హాజరుకావడంతో బస్సు సేవలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని పీఆర్‌టీసీ మేనేజింగ్ డైరెక్టర్ శివకుమార్ తెలిపారు.

ఆలయంలో త్రిశూలంపై నాగుపాము

● పూజలు చేసిన భక్తులు

వేలూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వేలూరు సమీపంలోని ఆంబూరు తాలూకా పెరియవరిగమ్ గ్రామంలోని నాగమ్మాళ్ ఆలయ శూలంపై ఓ నాగుపాము ప్రత్యక్షమైంది. వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని శుక్రవారం తెల్లవారుజామము నుండే ఆలయానికి వెళ్ళిన భక్తులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో, ఆలయ త్రిశూలంపై ఓ నాగుపాము కనిపించడంతో ఇది అమ్మవారి మహిమేనంటూ పూజలు చేశారు. సుమారు గంటసేపు త్రిశూలంపై ఉన్న ఆ నాగుపాము తర్వాత వెళ్లిపోయింది.



చెన్నైలోని తన నివాసంలో శుక్రవారం జరిగిన వరలక్ష్మీ వ్రతం, సత్యనారాయణవ్రతానికి హాజరైన తెలంగాణ మాజీ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్‌ను సత్కరిస్తున్న బీజేపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పొన్నూరు రంగనాయకులు కుటుంబీకులు.

రాధాపురంలో వడ్రంగి దారుణహత్య

● నలుగురు యువకుల అరెస్టు



హత్యకు గురైన ప్రభుదాస్ (ఫైల్‌ఫొటో)

చెన్నై, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లా రాధాపురంలో రెండు రోజుల క్రితం మోటారు సైకిల్‌పై వెళుతున్న వడ్రంగి ప్రభుదాస్ (27) హత్యకు సంబంధించి నలుగురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు.ఓ మహిళతో వివాహేతర సంబంధం నేపథ్యంలో ఈ హత్య జరిగినట్లు పోలీసులు తెలిపారు. బుధవారం రాత్రి స్నేహితుడితో కలిసి బైకుపై వెళ్ళిన ప్రభుదాస్ కోళియాంకుళం వద్ద వంటి నిండా కత్తిపోట్లతో పడి ఉండగా పోలీసులు కనుగొన్నారు. పోస్టుమార్టం నివేదికలో ప్రభుదాస్ హత్యకు గురైనట్లు తెలియటంలో పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరిపి కూడంకుళమ్ ప్రాంతానికి చెందిన లింగుసామి (22) అతడి అనుచరులు మహరాజన్ (23), వినోద్ (42), అరుణ్‌కుమార్ (21)ల హత్య చేసినట్లు కనుగొన్నారు. శుక్రవారం ఉదయం ఆ నలుగురిని అరెస్టు చేశారు.

తూత్తుకుడిలో పూజారి...

అడయార్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): తూత్తుక్కుడి జిల్లాలో ఓ పూజారి దారుణ హత్యకు గురయ్యాడు. తన తల్లిని కిడ్నాప్ చేయడంతో ఆగ్రహించిన ఓ యువకుడు ఈ చర్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా... జిల్లాలోని ఏరల్ గ్రామానికి చెందిన రవి స్థానిక ఆలయంలో పూజారిగా పనిచేస్తున్నాడు. ఈయనకు రాజపతి గ్రామానికి చెందిన ముత్తురామలింగం భార్య ముత్తు విజయ అనే మహిళతో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయం భర్తకు తెలియడంతో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు తలెత్తడంతో నాలుగేళ్ళుగా దూరంగా ఉంటున్నారు. ఆ తర్వాత ముత్తు విజయ పూజారితో కలిసి ఉంటోంది. అయితే, పూజారికి అప్పటికే వివాహమై భార్య, పిల్లలున్నారు. అయితే, తన భార్య పూజారి రవి కారణంగానే తనకు దూరమైందని భావించిన ముత్తు విజయ భర్త ముత్తురామలింగం ఈ విషయాన్ని తన కుమారులకు పదేపదే చెప్పేవాడు. ఈ క్రమంలో రవి గురువారం రాత్రి ఓ దుకాణంలో చికెన్ కొనుగోలు చేస్తుండగా, ద్విచక్రవాహనంపై వచ్చిన కొందరు యువకులు పూజారిపై మారణాయుధాలతో దాడి చేయగా, ఆయన అక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరిపారు. ఈ విచారణలో ముత్తు విజయను పూజారి రవి కిడ్నాప్ చేశారని భావించిన ఆమె కుమారులు ఈ దారుణానికి పాల్పడినట్టు విచారణలో తేలడంతో కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

దిండివనంలో రోడ్డు ప్రమాదం

చెన్నై మహిళ మృతి ● పది మందికి గాయాలు

ప్యారీస్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా దిండివనంలో ప్రభుత్వ బస్సులు సహా మూడు వాహనాలు వెంటవెంటనే ఢీకొన్న ఘటనలో చెన్నై కి చెందిన మహిళ మృతిచెందగా, పది మంది గాయపడినట్టు పోలీసులు తెలిపారు. దిండివనం నుంచి ఓ కారు సెంజి వైపు బయలుదేరింది. అదేవిధంగా దిండివనం బయలుదేరిన ప్రభుత్వ బస్సు సరిహద్దు దాటుతున్న సమయంలో అదుపుతప్పిన కారు ఆ బస్సును ఢీకొంది. అదే సమయంలో ప్రమాదానికి గురైన కారును వెనుకవైపు నుంచి మరో బస్సు ఢీకొని రోడ్డు పక్కన ఉన్న గుంతలో బోల్తాపడటంతో అందులోఉన్న 10 మంది ప్రయాణికులకు గాయాలైయ్యాయి. కారు ఉన్న చెన్నైకి చెందిన వలర్మతి (30) సంఘటనా స్థలంలోనే మృతిచెందింది. సమాచారం తెలిసి సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వరుసగా మూడు వాహనాలు ఢీకొనడంతో దిండివనం రహదారిలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు, రహదారిశాఖ సిబ్బంది ప్రమాదానికి గురైన వాహనాలను తొలగించడంతో ట్రాఫిక్ క్లియర్ అయింది.

తండ్రీకొడుకులపై వీధికుక్క దాడి

చెన్నై, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మదురైలోని లేక్‌ఏరియా 15వ వీధిలో నివసిస్తున్న ఎనిమిదేళ్ల బాలుడిని, అతడి తండ్రిని ఓ వీధికుక్క కరచిన సంఘటన స్థానికులకు భయాందోళనలు కలిగించింది. లేక్ ఏరియాలోని ఓ ఇంటిలో నివసిస్తున్న ముత్తుసామి (40) కుమారుడు సెంథిల్ (8) శుక్రవారం ఉదయం పాఠశాలకు వెళ్తుండగా ఆ ఇంటి గేటు ఎక్కి వచ్చిన వీధికుక్క అతడిని కరచింది. దీంతో సెంథిల్ కేకలు పెట్టాడు. అది విని ముత్తుసామి అక్కడికి పరుగెత్తుకుని రాగా ఆ కుక్క అతడిని కూడా వెంబడించి కాళ్లు చేతులపై కరచింది. అదే సమయంలో స్థానికులు రావడంతో ఆ శునకం అక్కడి నుండి పారిపోయింది. ఈ సంఘటనలో సెంథిల్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న కార్పొరేషన్ అధికారులు కుక్కలను పట్టుకునే సుగాలీల ద్వారా ఆ వీధికుక్కను పట్టుకెళ్ళారు. ఆ వీధికుక్క ఇంటి గేటుపై ఎగురుతూ వెళ్ళి బాలుడిని, అతడి తండ్రిని కరచిన దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో తీవ్రంగా వైరల్ అవుతోంది.

కుట్రాలం జలపాతానికి పెరిగిన రద్దీ

● స్నానాలు చేసేందుకు బారులు తీరిన పర్యాటకులు



కుట్రాలం జలపాతం వద్ద స్నానమాచరిస్తున్న పర్యాటకులు

చెన్నై, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతం కుట్రాలం జలపాతం వద్ద శుక్రవారం ఉదయం వేలాదిమంది పర్యాటకులు తరలివచ్చారు. ప్రస్తుతం జలపాతంలో నీరు ఆహ్లాదకరంగా పడుతుండటంతో పర్యాటకులు స్నానాలు చేసేందుకు వేకువజామునే చేరుకున్నారు. గత నాలుగు రోజులుగా కుట్రాలం పరిసర ప్రాంతాల్లో చిరుజల్లులు పడుతున్నాయి. ప్రధాన జలపాతం, ఐందరువి, పాత కుట్రాలం, చిత్రరువి, పులి అరువి జలపాతాలలోనూ నీరు పడుతోంది. వరుసగా మూడు రోజులపాటు సెలవులుగా ఉండటంతో రాష్ట్రం నలమూలల నుండి వచ్చిన పర్యాటకులతో కుట్రాలం ప్రాంతం సందడిగా మారింది.

జనవరి నాటికి ఎయిమ్స్ తొలి విడత పనులు పూర్తి

● హైకోర్టుకు నివేదించిన కేంద్రం

పెరంబూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఎయిమ్స్ ఆస్పత్రి తొలివిడత నిర్మాణపనులు వచ్చే ఏడాది జనవరి నాటికి పూర్తవుతాయని, జనవరి 26వ తేదీ భవనాలను ఆస్పత్రికి అప్పగించనున్నట్లు కేంద్రప్రభుత్వం హైకోర్టుకు నివేదిక సమర్పించింది. మదురై ఎయిమ్స్‌ను త్వరగా పూర్తి చేసేలా కేంద్రాన్ని ఆదేశించాలని కోరుతూ మదురైకి చెందిన కేకే రమేష్ గతంలో దాఖలు చేసిన ప్రజా ప్రయోజనంపై శుక్రవారం మరోమారు హైకోర్టు మదురై ధర్మాసనంలో విచారణ జరిగింది. తోపూర్‌లో 224.23 ఎకరాల్లో ఎయిమ్స్ ఆస్పత్రి నిర్మిస్తామని కేంద్రప్రభుత్వం 2018 జూన్‌లో ప్రకటించగా, 2019లో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ శంకుస్థాపన చేశారని పిటిషనర్ తరపు న్యాయవాది పేర్కొన్నారు. అందుకోసం భూసేకరణ చేపట్టి, రూ.10 కోట్లతో 5.50 కి.మీ ప్రహరీ గోడ నిర్మించారని, అప్పటి నుంచి ఇప్పటివరకు నిర్మాణాలు ప్రారంభించలేదని, ఎయిమ్స్ నిర్మాణాలు త్వరగా ముగించేలా ఆదేశించాలని అభ్యర్థించారు. న్యాయమూర్తులు జస్టిస్ ఎస్ఎం సుబ్రమణ్యం, జస్టిస్ ఏటీ మరియా క్లాట్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు విచారణ జరగ్గా.. మదురై ఎయిమ్స్ ఆసుపత్రి నిర్మాణాలు వేగవంతంగా సాగుతున్నాయని, పలు విడతలుగా పనులు చేపట్టామని కేంద్రప్రభుత్వం తరపు న్యాయవాది వివరించారు. ఇప్పటికే 50 శాతం పనులు పూర్తయ్యాయని, తొలివిడత నిర్మాణపనులు పూర్తిచేసి, జనవరి 26వ తేది ఆస్పత్రిని అప్పగిస్తామని కోర్టుకు తెలిపారు.నిర్ణీత కాలంలో పనులు ముగించేలా ఉత్తర్వులు జారీచేయాలని ఈ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది కోరారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. నిర్మాణపనులు వేగంగా జరుగుతున్నాయని కేంద్రప్రభుత్వం చెబుతోందని, ఒక ఆసుపత్రిని నిర్ణీత కాలంలో నిర్మించాలని ఆదేశించలేమంటూ.. పిటిషన్‌పై విచారణ ముగిస్తున్నట్లు ప్రకటించింది.



చిత్ర బృందానికి సన్మాన దృశ్యం

'అక్యూస్డ్' బృందానికి ప్రశంసల వెల్లువ

జేషన్ స్టూడియోస్, సచిన్ సినిమాస్, దయా కరన్ ప్రొడక్షన్ సంయుక్తంగా నిర్మించిన 'అక్యూస్డ్' చిత్రానికి అన్ని వర్గాల నుంచి ప్రశంసలు లభిస్తున్నాయి. దీంతో చిత్ర బృందాన్ని పలువురు సినీ ప్రముఖులు, పంపిణీదారులు, థియేటర్ యజమానులు ప్రత్యేకంగా సన్మానించి అభినందించారు. ఉదయ, అజ్మల్, యోగి బాబు ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం గతవారం రాష్ట్ర వ్యాప్తంగా విడుదలైంది. ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి మాత్రమేకాకుండా, సినీ ప్రముఖులు, సినిమా జర్నలిస్టుల, సినీ విశ్లేషకుల నుంచి పాజిటివ్ టాక్ వచ్చింది. దీంతో ఈ సినిమా ప్రదర్శించే థియేటర్ల సంఖ్యను కూడా పెంచారు. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా మదురై, కోవై, తిరుచ్చి, సేలం, తిరుపూర్, చెంగల్పట్టు తదితర ప్రాంతాలకు చిత్ర బృందం థియేటర్ టూర్‌కు వెళ్ళి అభిమానులు, సినీ ప్రేక్షకులతో కలిసి సందడి చేస్తోంది. ఆ సమయంలో హీరో ఉదయ పాత్రను ప్రేక్షకులు, అభిమానులు ప్రత్యేకంగా అభినందిస్తున్నారు. ఈ సక్సెస్‌పై మూవీ మేకర్స్ మాట్లాడుతూ, 'ఘన విజయాన్ని అందించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఈ విషయం వారికే అంకితం చేస్తున్నాం. ఈ విజయానికి కారణమైన ప్రతి ఒక్కరితో పాటు మీడియా, పంపిణీదారులు, థియేటర్ యజమానులకు మా హృదయపూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు అని పేర్కొన్నారు. కాగా, ఈ చిత్రానికి కన్నడంలో హిట్ చిత్రాల దర్శకుడిగా గుర్తింపు పొందిన ప్రభు శ్రీనివాస్ దర్శకత్వం వహించారు.

నాకు స్ఫూర్తి సిమ్రన్

● త్రిష



'టూరిస్ట్ ఫ్యామిలీ'లో సీనియర్ నటి సిమ్రన్ నటన అద్భుతమని, ఆమె తనకు స్ఫూర్తి అని ప్రముఖ హీరోయిన్ త్రిష అన్నారు. శశికుమార్ - సిమ్రన్ జంటగా నటించిన 'టూరిస్ట్ ఫ్యామిలీ' ఇటీవల విడుదలై ఘన విజయం సాధించింది. ఈ సినిమా చూసిన త్రిష.. చిత్ర బృందాన్ని ప్రశంసించారు. 'అద్భుతమైన చిత్రం. అద్భుతమైన నటన. శశికుమార్, సిమ్రన్‌ల నటన వర్ణించేందుకు మాటలు లేవు. సూపర్బ్. ఈ చిత్రాన్ని నేను ఆలస్యంగా చూసినప్పటికీ ఒక మంచి సినిమా చూశాను. మంచి మనసు ఉన్న వారికి మాత్రమే మంచి జరుగుతుంది అనే నానుడిని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను. అలాగే, ఒక అద్భుతమైన చిత్రాన్ని రూపొందించిన దర్శకుడు అభిజిత్ జీవింత్‌ను కూడా ప్రత్యేకంగా అభినందిస్తున్నాను. అలాగే, నేను కలిసిన రోజు నుంచి ఇప్పటివరకు నాకు సిమ్రన్ ఒక స్ఫూర్తి, ప్రేరణగా నిలిచారు' అని పేర్కొన్నారు.

హీరోగా శంకర్ కుమారుడు



అర్జిత్

ప్రముఖ దర్శకుడు శంకర్ కుమారుడు అర్జిత్ హీరోగా పరిచయం కానున్నారు. ప్రస్తుతం శివకార్తికేయన్ - ఏఆర్.మురుగదాస్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న 'మదరాసి' సినిమాకు అర్జిత్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఆయన త్వరలో హీరోగా పరిచయంకానున్నారు. ఆ అసిస్టెంట్ దర్శకుడు చెప్పిన కథ శంకర్‌కు నచ్చడంతో తన కుమారుడిని హీరోగా వెండితెరకు పరిచయం చేసేందుకు అంగీకరించారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రీప్రొడక్షన్ నిర్మాణ పనులు జరుగుతుండగా, ఈ చిత్రాన్ని ఫ్యాషన్ స్టూడియోస్ నిర్మించనుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి పూర్తి వివరాలను త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు. ఇదిలావుంటే, శంకర్ కుమార్తె అదితి ఇప్పటికే హీరోయిన్‌గా రాణిస్తున్న విషయం తెల్సిందే.

విజయాల్లో అన్బరివులది పెద్ద పాత్ర

● లోకేష్ కనకరాజ్

చిత్రజ్యోతి


తాను దర్శకత్వం వహించి విజయం సాధించిన చిత్రాల్లో ఫైట్ మాస్టర్ ద్వయం అన్బరివుల పాత్ర ఎంతో ఉందని వెల్లడిస్తూ, ఈ సందర్భంగా అన్బరివుల ద్వయానికి ప్రముఖ దర్శకుడు లోకేష్ కనకరాజ్ కృతజ్ఞతలు తెలిపారు. లోకేష్ దర్శకత్వం వహించిన 'మానగరం', 'ఖైదీ', 'విక్రమ్', 'లియో', 'కూలీ' చిత్రాలకు స్టంట్ మాస్టర్‌గా అన్బరివులు పనిచేశారు. ఈ చిత్రాలన్నీ ఘన విజయం సాధించాయి. ఈ నెల 14న రజనీకాంత్ నటించిన 'కూలీ' విడుదలకానుంది. ఈ నేపథ్యంలో లోకేష్ కనకరాజ్ ఎక్స్ ఖాతాలో ఓ ట్వీట్ చేశారు. 'నా దర్శకత్వ కెరీర్ మొదటి రోజు నుంచి నేటి వరకు నాకు ఒక స్తంభంలా ఉన్న వ్యక్తులు అన్బరివు. వారి గురించి మాట్లాడటానికి ఇదే సరైన తరుణం. నేను ఇపుడు ఏ స్థాయిలో ఉన్నానో.. ఆ స్థాయిని మొదటి నుంచి కోరుకున్న వ్యక్తులు వీరిద్దరు. నా జీవితంలో సాధించిన అన్ని విజయాల్లో వారిద్దరు పెద్ద పాత్ర పోషించారు. ఇందుకోసం వారికి ధన్యవాదాలు. అలాగే, దర్శకత్వంలోకి అడుగుపెట్టిన ఈ దర్శక ద్వయం ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరుకుంటున్నాను' అని పేర్కొన్నారు.



'కూలీ' సెట్‌లో అన్బరివు, లోకేష్ కనకరాజ్

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

● అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు



కొండితోపు ముల్లావీధిలోని రంగనాథుడి ఆలయంలో అమ్మవారికి విశేష అలంకరణ



షావుకారుపేటలోని శ్రీరామకృష్ణ చైతన్య మందిరంలో అమ్మవారికి గాజులతో అలంకరణ

ప్యారీస్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శ్రావణ పౌర్ణమికి ముందు రోజు శుక్రవారం హిందువులు వరలక్ష్మీ వ్రతం జరుపుకున్నారు. శ్రావణ మాసంలో వరలక్ష్మీ వ్రతానికి ఎంతో ప్రత్యేకత ఉంది. ముత్తయిదువులు లక్ష్మీదేవిని విశేషంగా అలంకరించి, పిండివంటలు చేసి నైవేద్యం పెట్టి వ్రతం చేసుకున్నారు. ముత్తయిదువులకు వాయినాలు ఇచ్చి, పగలంతా ఉపవాసంతో ఉండి సాయంత్రం అమ్మవారికి నివేదించిన ప్రసాదాలు ఆరగించి వ్రతాన్ని పూర్తిచేశారు. అమ్మవార్లు కొలువైన ఆలయాల్లో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని వైభవంగా నిర్వహించగా ముత్తైదువులు లక్ష్మీదేవికి కానుకలు సమర్పించి శుభాలు కలగాలని వేడుకున్నారు. ఆలయ నిర్వాహకులు పలు రకాల పూలు, అరటి, మామిడి తోరణాలు, విద్యుత్ దీపాలతో ఆలయాలను అలంకరించారు. నగరంలోని తిరువేర్కాడులోని శ్రీదేవి కరుమారియమ్మన్ ఆలయం. మాంగాడు కామాక్షి అమ్మవారి ఆలయం, తిరుముల్లైవాయల్‌లోని పచ్చయమ్మన్ ఆలయం, ప్యారీస్ తంబుశెట్టి వీధిలోని కాళికాంబాళ్ ఆలయం, ఆదియప్ప నాయకన్‌వీధిలోని శ్రీకన్యకా పరమేశ్వరి దేవస్థానం, కొండితోపు మూల్లావీధిలోని రంగనాథస్వామి ఆలయం, షావుకారుపేటలోని నిమిషాంబదేవి ఆలయం, రెడ్డిరామన్‌వీధిలోని శ్రీరామకృష్ణ చైతన్య మందిరం, వరదాముత్తియప్పన్‌వీధిలోవున్న గీతామందిరం, తిరువళ్లూరు సమీపంలోని పుట్లూరు అంకాల పరమేశ్వరి తదితర ఆలయాల్లో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని సుమంగళి, దీపపూజలను నిర్వహించారు. అమ్మవారికి పులిహోర, గారెలు, బూరెలు, పరమాన్నం తదితర ప్రసాదాలు నివేదించి మంగళహారతులిచ్చారు. అదేవిధంగా అమ్మవారిని తొలి ముత్తైదువుగా భావించి చీర, రవిక, పసుపు కుంకుమ వాయినంగా సమర్పించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ముత్తైదువులకు పసుపు కుంకుమలు, అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.



శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో సుమంగళి పూజ



మీడియా సమావేశంలో కె.శశిధర్ తదితరులు

ఘనంగా సెంట్రల్ బ్యాంకు
వ్యవస్థాపక దినోత్సవం

అడయార్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రముఖ బ్యాంకుల్లో ఒకటైన సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 144వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకుంది. ఇది 1911లో స్థాపించిన తొలి స్వదేశీ బ్యాంకు అని ఆ బ్యాంకు చెన్నై జోన్ జనరల్ మేనేజర్ కె.శశిధర్ వెల్లడించారు. ఇదేవిషయంపై ఆయన శుక్రవారం నగరంలో మీడియాతో మాట్లాడుతూ, గత 144 యేళ్ళుగా దేశ ప్రజలకు బ్యాంకింగ్ సేవలను అందిస్తున్నామన్నారు. దేశ వ్యాప్తంగా 4545 శాఖలు, 4085 ఏటీఎం కేంద్రాలు, 21 వేల టచ్‌పాయింట్స్ కలిగివుందన్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో 65 శాతం శాఖలున్న బ్యాంకుగా గుర్తింపు పొందిందన్నారు. అంతేకాకుండా 1921లో హోం సేవింగ్ చెక్ బుక్, 1926లో సేఫ్ డిపాజిట్ వోల్ట్, 1980లో క్రెడిట్ కార్డు, దేశ బ్యాంకింగ్ వ్యవస్థలో ఏఐ ఆధారిత గోల్డ్ లోన్ ఏటీఎం ప్రారంభించామని వెల్లడించారు. ఇదిలావుండగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.7.04 లక్షల కోట్ల వ్యాపారంతో రూ.1,169 కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్టు వెల్లడించారు.

'అవయవదాన' నమోదులో వరల్డ్ రికార్డు



ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న మంత్రి ఎం.సుబ్రమణ్యం తదితరులు

అడయార్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రముఖ ఆస్పత్రుల్లో ఒకటిగా గుర్తింపు పొందిన శ్రీ రామకృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అవయవదాన నమోదు ప్రక్రియలో ప్రపంచ రికార్డు సృష్టించింది. కేవలం మూడు నెలల్లో ఏకంగా 45,861 మంది అవయవదానికి సముఖత వ్యక్తం చేస్తూ ప్రతిజ్ఞ చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ మధ్యకాలంలో ఈ సంఖ్య నమోదైందని ఇది ప్రపంచ రికార్డు అని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. ఈ అరుదైన రికార్డు పురస్కరించుకుని శుక్రవారం నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య మంత్రి ఎం.సుబ్రమణ్యం పాల్గొని ఆస్పత్రి నిర్వాహకులను అభినందించి ప్రశంసా పత్రం ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌ప్లాంటేషన్ అథారిటీ గవర్నమెంట్ ఆఫ్ తమిళనాడు మెంబర్ సెక్రటరీ ఎన్.గోపాలకృష్ణన్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.ప్రహదీశ్వరన్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈ తరహా ప్రచారాన్ని నేషనల్ ఆర్గాన్ అండ్ టిష్యూ ట్రాన్స్‌ప్లాంట్ ఆర్గనైజేషన్ (నోటో) సహకారంతో 2024లో ప్రారంభించామని డాక్టర్ ప్రహదీశ్వరన్ వెల్లడించారు.

పంద్రాగస్టు రిహార్సల్ ప్రారంభం





రిహార్సల్స్ చేస్తున్న పోలీసు దళాలు

పెరంబూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15న దేశ 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు శుక్రవారం రిహార్సల్స్ ప్రారంభమయ్యాయి. జార్జి కోటలో ముఖ్యమంత్రి స్టాలిన్ జాతీయ పతాకం ఎగురవేయనున్నారు. ఈ సంద్భంగా పోలీసు శాఖలోని పలు విభాగాలు, సీఆర్‌పీఎఫ్, హోంగార్డ్స్, రిజర్వ్ పోలీసు, అశ్వ దళం తదితర బృందాలు కవాతు ప్రదర్శన నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో, స్వాతంత్ర్య దినోత్సవం తొలి రిహార్సల్స్ శుక్రవారం కామరాజర్ రోడ్డులో జరిగాయి. మరోమారు రిహార్సల్స్ 11,13 తేదీల్లో జరుగనున్నాయి. రిహార్సల్స్ సందర్భంగా ఉదయం 6 నుంచి కార్యక్రమం ముగిసే వరకు కామరోజర్ రోడ్డుకిరువైపులా వాహనాలు అనుమతించని పోలీసులు, ప్రత్యామ్నాయ మార్గాల్లో పంపించారు.







నుంగంబాక్కంలో అమ్మవారి ఊరేగింపు - క్షీర కలశాలతో మహిళల ఊరేగింపు - కాకలూరులో అమ్మవారికి విశేష అలంకరణ

ఆలయాల్లో కోలాహలంగా
ఆడి శుక్రవారం వేడుకలు

ప్యారీస్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరంలో ఆడి నాలుగో శుక్రవారం సందర్భంగా పలు ప్రాంతాల్లో నిర్వహించిన వేడుకల్లో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. నుంగంబాక్కం పుష్పానగర్‌లోని ఆదిపరాశక్తి ఆలయంలో అమ్మవారికి మహాక్షీరాభిషేకం, పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. 108 మంది మహిళలు పాల కలశాలతో ఊరేగింపుగా వళ్లువర్ కోట్టమ్ నుంచి బయలుదేరి పుష్పానగర్ చేరుకున్నారు. నాలుగో ఆడి శుక్రవారం సందర్భంగా అమ్మవారి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి మేళతాళాలు, మంత్రోచ్చారణ మధ్య పురవీధుల్లో ఊరేగించారు. తిరుముల్లైవాయల్‌లోని పచ్చయమ్మన్ ఆలయంలో ఉత్సవమూర్తిని గజలక్ష్మిగా అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు. అలాగే పాడి ఎంటీహెచ్ రోడ్డులో ఉన్న బడవట్టమ్మన్ ఆలయం, చూలై అంకాల పరమేశ్వరి ఆలయం, ఆదంబాక్కం కరుమారియమ్మన్ ఆలయం సహా నగరంలోని పలు ప్రాంతాల్లోని ఆలయాల్లో నిర్వహించిన పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అలాగే తిరువళ్లూరు సమీపంలోని కాకలూరు సెల్వగణపతి, శ్రీరామ ఆలయంలో అమ్మవారికి నిర్వహించిన విశేషపూజల్లో ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో కొత్త మట్టి కుండల్లో తయారుచేసిన పొంగలిని అమ్మవారికి నివేదించి మొక్కులు చెల్లించుకున్నారు.

చెన్నై వేదికగా 'ఇంపాక్టీర్స్'

చెన్నై, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోని మొట్టమొదటి ఏఐ ఆధారిత 'బిజినెస్ టు టాలెంట్' (బీ2టి) ప్లాట్‌ఫాం 'ఇంపాక్టీర్స్' కోసం గ్లోబల్ లాంచ్‌ప్యాడ్‌గా చెన్నై మెరిసింది. సంస్థ వ్యవస్థాపకులు జర్మనీ వ్యాపారవేత్త కృష్ణా జవ్వాజి, సహ వ్యవస్థాపకులు మనోహర్ జవ్వాజి, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ డాక్టర్ బాల తంజావూర్, చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్ సంజీవ్ కొరడ శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఈ వివరాలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంపాక్టీర్స్ వ్యక్తులు, వ్యాపారాలు తమ వృత్తిని నిజ సమయంలో కనుగొనడంలో సహాయపడుతుందన్నారు. విద్య-ఉపాధి మధ్య అంతరాన్ని తగ్గిస్తుందన్నారు. దేశంలో 85 శాతం కన్నా ఎక్కువమంది శ్రామికులు తమ నైపుణ్యానికి తగినంత ఉపాధి పొందడం లేదన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 300 మిలియన్లకు పైగా నిపుణులు కెరీర్ అసంతృప్తితో జీవిస్తున్నారని, మరో 1.2 బిలియన్ల యువకులు ఏఐ ద్వారా వేగంతో పునర్నిర్మించబడుతున్న ఉద్యోగమార్కెట్లోకి ప్రవేశిస్తున్నారని వివరించారు. ఇంపాక్టీర్స్ రానున్న 24 నెలల్లో 10 మిలియన్ల మందికి కెరీర్ స్పష్టత, వృద్ధి కనుగొనడంలో సహాయపడడం, భవిష్యత్తుకు సిద్ధంగావున్న ప్రతిభతో మిలియన్ వ్యాపారాలను శక్తివంతం చేయడమనే లక్ష్యంతో అడుగుపెడుతోందన్నారు. ప్రస్తుతం భారత్‌లో ప్రతి ముగ్గురు గ్రాడ్యుయేట్లలో ఒకరు ఆయా రంగంలో నిరుద్యోగులుగా వున్నారని, ఏఐ అభివృద్ధి చెందుతున్నకొద్దీ ప్రతి పదిమంది కార్మికుల్లో నలుగురు వెనుకబడిపోతారని ఆందోళన చెందుతున్నారని గుర్తు చేశారు. దానిని పరిష్కరించడానికే ఇంపాక్టీర్స్ రూపొందించామని వివరించారు. నిరుద్యోగుల ఉద్దేశాన్ని కనుగొనడంలో, సామర్థ్యాలను నిర్మించడంలో, భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తాము వారికి సహాయం చేస్తామని ప్రకటించారు.



సేవలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

రౌండ్ టేబుల్ ఇండియాతో శ్రీరామ్ వెల్త్ ఒప్పందం

చెన్నై, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సమాజంలో వ్యక్తిగత ఆర్థిక ప్రయోజనాలను పెంపొందింపజేయడమే తమ లక్ష్యమని శ్రీరామ్ వెల్త్ ఎండీ వికాస్ సతీజా తెలిపారు. నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో సామాజిక సహాయ కార్యక్రమాలను విరివిగా చేపట్టేలా శ్రీరామ్ వెల్త్ లిమిటెడ్, ప్రఖ్యాత రౌండ్ టేబుల్ ఇండియాతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఆ ప్రకారం శ్రీరామ్ వెల్త్ తన క్లయింట్లను దేశావ్యాప్తంగా చేపట్టే సేవా కార్యక్రమాలలో భాగస్వామ్యం కలిగించనుంది. రౌండ్ టేబుల్ ఇండియా జాతీయ అధ్యక్షుడు రాచిత్ బన్సాల్, శ్రీరామ్ వెల్ ఎండీ వికాస్ ఈ ఒప్పందంపై సంతకం చేశారు.



ఒప్పంద పత్రాలపై సంతకాలు చేస్తున్న సంస్థల నిర్వాహకులు

కేసీజీ సాంకేతిక కళాశాలలో
ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



చేనేత దినోత్సవంలో పాల్గొన్న కేసీజీ సాంకేతిక కళాశాల నిర్వాహకులు, వీవర్స్ సొసైటీ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్ శశికళ తదితరులు

చెన్నై, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కేసీజీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో 11వ జాతీయ చేనేత దినోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ, చేనేత అభివృద్ధి కమిషనర్ కార్యాలయం, చెన్నైలోని చేనేత కార్మికుల సేవా కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. స్కూల్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, చేతివృత్తులవారు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో చేనేత కార్మికుల సేవా కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్ శశికళ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానంతో చేనేత వస్త్రాలను నేటి తరానికి నచ్చే విధంగా రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. హిందుస్థాన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఛైర్మన్ డాక్టర్ ఆనంద్ జేకబ్ వర్గీస్ చేనేత భారతీయ సంస్కృతిలో భాగమని, చేనేత వస్త్రాలను ఆదరించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కేసీజీ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఆన్నీ జేకబ్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ముత్తుకన్నన్ తదితరులు పాల్గొన్నారు.

తిరుచెందూరులో 14న ఆవణి ఉత్సవాలు

చెన్నై, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూరు సుబ్రహ్మణ్యస్వామివారి ఆలయంలో ఆవణి ఉత్సవాలు ఈ నెల 14న ధ్వజారోహణంతో ప్రారంభం కానున్నాయి. అర్థరాత్రి 1.30 గంటలకు విశ్వరూప దర్శనం, వేకువజాము రెండు గంటలకు ఉదయమార్తాండ అభిషేకం, 5 నుంచి ధ్వజారోహణం జరుగనున్నాయి. సాయంత్రం నాలుగు గంటలకు గర్భాలయంలో మహాదీపారాధన చేయనున్నారు. ఈ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవం ఈ నెల 23న అత్యంత వైభవంగా జరుగనుంది.

పద్మావతి అమ్మవారి ఆలయంలో
వైభవంగా వరలక్ష్మీ వ్రతం



ప్యారీస్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): టీటీడీ చెన్నై నిర్వహణలో టి.నగర్ జీఎన్ చెట్టి రోడ్డులో ఉన్న పద్మావతి అమ్మవారి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు ఆలయ ప్రాంగణంలో అర్చకులు పూజలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని మామిడి, అరటి తోరణాలు, విద్యుద్దీపాలతో అలంకరించారు. ఉదయం నుంచి వ్రతం ఆచరించిన మహిళలు సుమంగళి పూజలో పాల్గొని అమ్మవారిని సేవించారు. భక్తులందరికీ ఆలయం తరపున పసుపు కుంకుమ, అన్నప్రసాదం పంపిణీ చేశారు.

● నేడు రక్షా బంధన్...

జోరుగా రాఖీల విక్రయాలు
పలువురికి రాఖీ కట్టిన విద్యార్థినులు



అమ్మకాలకు సిద్ధంగా రాఖీలు



→ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద వాహనచోదకులకు రాఖీలు కడుతున్న కళాశాల విద్యార్థినులు

ప్యారీస్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా హిందువులు జరుపుకునే పండుగల్లో విశిష్టమైనది 'రక్షా బంధన్'. ఈ పండుగ రోజు లక్ష్మీ నారాయణుడిని పూజించి రాఖీ కడితే శుభం జరుగుతుందనే నమ్మకంతో సోదరీమణులు తమ సోదరులకు రాఖీ కట్టి వారి అనుబంధంతో మాధుర్యాన్ని పంచుకుంటారు. రాఖీ అనేది కేవలం ఒక దారం మాత్రమే కాదు సోదరీ, సోదరుల మధ్య ఉండే అనుబంధానికి సూచిక. అందువల్లే ఒక రోజు ముందే రాజధాని నగరంలో పండుగ వాతావరణం చోటుచేసుకుంది. పంచాంగం ప్రకారం ఈ ఏడాది శ్రావణ పౌర్ణమి తిథి శనివారం (ఆగస్టు 8వ తేదీ) మధ్యాహ్నం 2.12 గంటలకు ప్రారంభమవుతుంది. అనంతరం ఆదివారం మధ్యాహ్నం 1.24 గంటతో ముగుస్తుంది. ఈ శుభ సమయంలో తమ తోబుట్టువులకు, సోదరులుగా భావించే వారికి రాఖీలు కట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ పర్వదినాన సత్యనారాయణ స్వామిని, లక్ష్మీదేవిని పూజించడం వల్ల సర్వాభీష్టాలు చేకూరుతాయని నమ్మకం. కాగా, రక్షా బంధన్ పండుగను పురస్కరించుకుని నగరంలో షావుకారుపేట, మైలాపూర్, అడయార్, వడపళని, ప్యారీస్, తిరువొత్తియూర్ తదితర ప్రాంతాల్లో ఆకట్టుకునే రకరకాల రాఖీల అమ్మకాలు జోరుగా సాగాయి.



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా బ్రహ్మగుడి వద్ద శుక్రవారం వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న భక్తులు

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

గూడూరు అర్బన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు యువకులను శుక్రవారం గూడూరు ఒకటో పట్టణ పోలీసులు పట్టుకున్నారు. పోలీ సుల వివరాల మేరకు... స్థానిక మాయాబజారుకు ప్రాంతానికి చెందిన హనుమంతు, గమళ్లపాళెం ప్రాంతానికి చెందిన గణేష్ 600 గ్రాముల గంజాయి చిన్న ప్యాకెట్లతో రైల్వేస్టేషన్ తూర్పు వైపున ఉన్న పాడుపడిన క్వార్టర్స్ వద్ద వద్ద ఉండగా అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా నిషేధిత మత్తు పదార్థాలను స్థానిక ఆస్పత్రి రోడ్డులోని రెండు దుకాణాల మధ్య సన్నని సందులో దాచిపెట్టి, అదే ప్రాంతానికి చెందిన నయాం అనే వ్యక్తి సాయంతో విక్రయాలు సాగిస్తున్నట్లు వెల్లడించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుపతయ్య తెలిపారు.


శ్రీవారి సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ కృష్ణతేజ విశ్రాంతి భవనం వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.80 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 65,234

తలనీలాలు సమర్పించినవారు: 26,133



సుస్థిర ప్రగతి దిశగా శ్రీసిటీ

● ఎండీ రవీంద్ర సన్నారెడ్డి



రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఉద్యోగులు

సత్యవేడు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పదిహేడేళ్ల ప్రస్థానంలో ప్రపంచ తయారీ గమ్యస్థానంగా శ్రీసిటీ మారడం ఎంతో సంతోషంగా ఉందని ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అన్నారు. శ్రీసిటీ ఏర్పడి 17 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఇక్కడి బిజినెస్ సెంటర్‌లో తిరుపతి ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ... పరిశ్రమలు, ఉపాధితో పాటు సామాజిక వసతుల కల్పనపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహక పారిశ్రామిక విధానాలు, సహకారంతో భవిష్యత్తులో శ్రీసిటీ సుస్థిర ప్రగతి దిశగా మరింత వేగంగా ముందుకు సాగనుందని తెలిపారు. శ్రీసిటీలోని పలు పరిశ్రమల ఉద్యోగులు, విద్యార్థులు రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు.

తిరుపతి, రేణిగుంటలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

● బేకరీలు, స్వీట్ షాపుల్లో శ్యాంపుల్స్ సేకరణ

● ఒక బేకరీ సీజ్.. మరోదానికి నోటీసులు



తిరుపతిలోని బేకరీలో తనిఖీలు చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): తిరుపతి, రేణిగుంట ప్రాంతాల్లో ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారులు శుక్రవారం వివిధ బేకరీలు, స్వీట్ షాపులపై తనిఖీలు చేశారు. వీరితో పాటు తూనికలు, కొలతల శాఖ సిబ్బంది పాల్గొన్నారు. పాడైన స్వీట్లు, తినుబండారాలను ధ్వంసం చేశారు. రేణిగుంలోని ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనలు ఉల్లంఘించి పరిశుభ్రత పాటించని ఎస్పీ ఫుడ్ బేకరీని సీజ్ చేశారు. టూటీ ఫ్రూటీ తయారు చేసే దుకాణంలో పరిశుభ్రత, వినియోగదారులకు సౌకర్యాలు లేకపోవడంతో యజమానికి నోటీసులు జారీ చేశారు. ఈ రెండు ప్రాంతాల్లో 17 బృందాలుగా ఏర్పడి 35 బేకరీలు, స్వీట్ షాపులపై అధికారులు తనిఖీలు జరిపారు. 31 ఆహార పదార్థాలను శ్యాంపుల్స్‌గా సేకరించి ల్యాబ్‌కు పంపారు. దాదాపు 75 కిలోల కాలం చెల్లిన స్వీట్లు, తినుబండారాలను సీజ్ చేసి ధ్వంసం చేసినట్లు రాష్ట్ర ఫుడ్ కంట్రోల్ జాయింట్ కమిషనరు పూర్ణచంద్రరావు చెప్పారు. ఈ తనిఖీల్లో జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వర్లు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మద్దిలేటి, సిబ్బంది జగదీష్, సుమన్, దాదాపు 25 మంది ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

శ్రీవారిసేవలో హైకోర్టు న్యాయమూర్తులు



జస్టిస్ ప్రవీణ్ కుమార్ - జస్టిస్ మాల

తిరుమల, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జీ ప్రవీణ్ కుమార్, మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్ మాల శుక్రవారం ఉదయం శ్రీవారిని వేర్వేరుగా దర్శించుకున్నారు.ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు.వీరికి రంగనాయకమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రమాణాల ప్రకారమే..

ఇకపై సరుకుల కొనుగోలు

- టీటీడీ నిర్ణయం -

తిరుమల, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): ఇకపై ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎఫ్ఎస్ఎస్ఏఐ) నియమావళి ప్రకారమే టీటీడీ మార్కెట్ విభాగం 52 ఆహార వస్తువులు కొనుగోలు చేయనుంది. టెండర్లలో ఎలాంటి మినహాయింపులూ లేకుండా కొనుగోళ్లు జరగాలని టెక్నికల్ ఎక్స్‌పర్ట్ కమిటీ ఇచ్చిన సిఫార్సులను అమలు చేయనుంది. గత ప్రభుత్వంలో టీటీడీ అన్నప్రసాదాలు, లడ్డూప్రసాదాల నాణ్యత, రుచి తగ్గాయంటూ తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. ప్రభుత్వం మారిన తర్వాత వీటి రుచిని పెంచేందుకు టీటీడీ ఫోకస్ పెట్టింది. ఈవో శ్యామలరావు బృందం తొలుత కల్తీ నెయ్యిని గుర్తించి సరఫరా చేసే కొన్ని సంస్థలను బ్లాక్ లిస్ట్‌లో పెట్టారు. గతంలో నిలిపివేసిన నందిని నెయ్యి కొనుగోలు చేయాలని నిర్ణయించారు. అలాగే ప్రసాదాలు, అన్నప్రసాదాలు, లడ్డూ వంటి వాటిలో వినియోగించే ఆహార వస్తువుల కొనుగోలు ప్రక్రియ గత ప్రభుత్వంలో గతి తప్పినట్లు అధికారులు గుర్తించారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రమాణాలు ఉన్నప్పటికీ టీటీడీ ప్రొక్యూర్మెంట్ విధానంలోని స్టాండర్డ్స్ సక్రమంగా లేనట్లు తేలింది. ఈ క్రమంలోనే కొనుగోళ్లలో పాదర్శకత, నాణ్యత పెంపు కోసం రిలయన్స్ రిటైల్ లిమిటెడ్ నిపుణుల సేవలను ఏడాది పాటు ఉచితంగా వినియోగించుకోవాలని గతేడాది నవంబరులో నిర్ణయించారు.

టెక్నికల్ ఎక్స్‌పర్ట్ కమిటీ ద్వారా..

నిపుణుల సూచనలను పరిశీలించేందుకు టెక్నికల్ ఎక్స్‌పర్ట్ కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో సీఎస్ఐఆర్-ఎన్ఐఐఎస్‌టీ డైరెక్టర్ ఆనంద రామకృష్ణన్, ప్రభుత్వ జాయింట్ ఫుడ్ కంట్రోలర్ పూర్ణచంద్రరావు, మైసూరు సీఎఫ్‌టీఆర్ఐ సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఉషారాణిని నియమించారు. ఈ కమిటీ 52 ఆహార వస్తువుల స్పెసిఫికేషన్లను ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనలకు అనుగుణంగా సవరించి నివేదిక సమర్పించింది. దీని ఆధారంగానే ఇకపై టెండర్ల ద్వారా కొనుగోలు చేయాలని సూచించింది. నెయ్యి కొనుగోలులోనూ సెన్సరీ పారామీటర్లు చేర్చాలని, ఎన్ఏబీఎల్ అక్రిడిటెడ్ ల్యాబ్ సర్టిఫికెట్ తప్పనిసరి అనే సూచనలు చేసింది. దీని ప్రకారమే ఇకపై ఆహార వస్తువులను కొనుగోలు చేయాలని టీటీడీ అధికారులు గత నెలలో నిర్ణయించారు.

అమ్మవారి ఆలయంలో శాస్త్రోక్తంగా వరలక్ష్మీ వ్రతం

● కన్నుల పండువగా స్వర్ణ రథోత్సవం





స్వర్ణరథంపై ఊరేగుతున్న అమ్మవారు



టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్యచౌదరికి కంకణధారణ చేస్తున్న వేదపండితులు

తిరుచానూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయ ఆస్థానమండపంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని పంచరాత్ర ఆగమోక్తంగా నిర్వహించారు. ఉదయం ఉత్సవమూర్తిని ఆస్థాన మండపానికి వేంచేపుచేసి పద్మపీఠంపై కొలువు దీర్చి పూజాక్రతువులు నిర్వహించారు. అమ్మవారిని రోజా, చామంతి, మల్లె, సంపెంగి, తులసి, పన్నీరు ఆకు, మరువము, తామరపూల, వృక్షి వంటి సంప్రదాయ పుష్పాలతో అర్చించారు. తొమ్మిది గ్రంథులతో(నూలుపోగులు) అలంకరించారు. వరలక్ష్మి పూజావిధానం, వ్రత మహాత్మ్యాన్ని అర్చకుడు శ్రీనివాసాచార్యులు భక్తులకు వివరించారు. 12 రకాల నైవేద్యాలను అమ్మవారికి నివేదించాక మహామంగళ హారతితో వరలక్ష్మి వ్రతం ముగిసింది. వరలక్ష్మి వ్రతం సందర్భంగా ఏపీ, తెలంగాణలోని 52 టీటీడీ ఆలయాల్లో సౌభాగ్యం పేరిట 8లక్షల గాజులు, 1.60 లక్షల కంకణాలు, 1.60 లక్షల పసుపుదారాలు, 1.60 లక్షల కుంకుమ ప్యాకెట్లు, లక్ష్మీ అష్టోత్తర శత నామావళి పుస్తక ప్రసాదాలను అందించామన్నారు. ఆయా కార్యక్రమాల్లో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, భానుప్రకాష్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, డిప్యూటీ ఈవో హరీందర్ నాథ్, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, వీజీవోలు సురేంద్ర, రాంకుమార్, ఏఈవో దేవరాజులు, ఆలయ అర్చకుడు బాబుస్వామి, సూపరింటెండెంట్ రమేష్, శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాదు, చలపతి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వ్రత మండపం

టీటీడీ ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో ఆస్థాన మండపంలో ఏర్పాటుచేసిన వ్రత మండపం భక్తులను ఆకట్టుకుంది. 40మంది సిబ్బంది, 3 టన్నుల సంప్రదాయ పుష్పాలు, ఆరు రకాల 30వేల కట్ ఫ్లవర్స్‌తో అలంకరించారు.



స్వర్ణరథంపై అమ్మవారి అభయం

పద్మావతి ఉత్సవమూర్తిని శ్రీమహాలక్ష్మి అలంకారంలో స్వర్ణరథంపై కొలువుదీర్చారు. సాయంత్రం 6గంటలకు భక్తుల గోవిందనామ స్మరణల నడుమ తిరుమాడవీధుల్లో ఊరేగించారు. స్వర్ణరథం లాగడానికి మహిళా భక్తులు పోటీ పడ్డారు. వ్రతం సందర్భంగా అమ్మవారి మూలవర్లను బంగారు చీరతో అలంకరించారు. వరలక్ష్మీ వ్రతం, శ్రావణ శుక్రవారం కావడంతో అమ్మవారి దర్శనానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం 8 గంటలకు సర్వదర్శనం ప్రారంభమైంది. గేటు నెంబరు 4గుండా భక్తులను అనుమతించారు. క్యూలైన్లలో రద్దీ.. ఎండ వేడిమికి భక్తులు ఉక్కిరిబిక్కిరయ్యారు. సర్వదర్శనం గంటన్నరకుపైగా పట్టింది.



వాహనసేవ ముందు కళా బృందాల ప్రదర్శన

రాజకీయ ముసుగులో రౌడీయిజం చేస్తే సహించం

● ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోకపోతే తీవ్ర ఉద్యమానికి శ్రీకారం ● ప్రజా సంఘాల ఐక్య వేదిక అఖిల పక్ష సమావేశంలో నేతల స్పష్టం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాజకీయ ముసుగులో రౌడీయిజం చేస్తే ప్రశాంతమైన తిరుపతిలో ప్రజలెవ్వరూ సహించరని ప్రజా సంఘాల ఐక్య వేదిక అఖిల పక్ష సమావేశంలో నేతలు స్పష్టం చేశారు. తిరుపతిలోని అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. ప్రజా సంఘాల ఐక్య వేదిక కన్వీనర్, ఆర్పీఐ దక్షిణ భారత అధ్యక్షుడు పి.అంజయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత యువకుడు నీలం పవన్ కుమార్ కిడ్నాప్, దాడి దుర్మార్గమైనదని అన్నారు. ఆర్థిక లావాదేవీలుంటే పోలీసులు, కోర్టులు ఉన్నాయన్నారు. రాజకీయ అండ చూసుకుని చిత్రహింసలు పెట్టడం ఆవేదనకు గురి చేసిందన్నారు. తిరుపతి వంటి ప్రపంచ ఆధ్యాత్మిక క్షేత్రంలో రౌడీలు, గుండాలకు చోటివ్వకూడదన్నారు. ఇంతటి తీవ్ర దుర్మార్గానికి పాల్పడిన వారిని తిరుపతి నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటన బయటికి వచ్చింది, రానివి ఇంకెన్ని జరిగాయో తేల్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి కోరారు. నిందితులను అరెస్టు చేస్తే పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన చేయడం ఏమిటని డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ ప్రశ్నించారు. భవిష్యత్తులో ఇలాంటి దుర్మార్గాలు జరగకుండా పోలీసులు గట్టి చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండు చేశారు. పోలీసులు డ్రోన్లను నేర చరిత్ర గల రాజకీయ నేతల చుట్టూ తిప్పాలన్నారు. తిరుపతి ప్రశాంతతను కాపాడేందుకు రౌడీలు, నేరస్తులు భయపడే పరిస్థితి తీసుకురావాలని పోలీసులను సీపీఐ (ఎంఎల్) నేత వెంకటరత్నం కోరారు. 'ఈ దాడికి పాల్పడిన వారి నేర చరిత్రను పూర్తిగా పరిశీలించాలి. మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మనుషులే ఈ దాడికి పాల్పడ్డారనే ఆరోపణ వస్తోంది. దీనిపై భూమన స్పందించకపోవడం మరింత బలం చేకూరుస్తోంది' అని కాంగ్రెస్ నేత దొడ్డారెడ్డి రాంభూపాల్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుపతిలో రౌడీలు, గుండాలకు తావులేకుండా చేయడానికి, ఇలాంటి దారుణాలను కట్టడి చేయడానికి ప్రభుత్వానికి, పోలీసులకు ప్రజల అండ అవసరమని మాజీ మంత్రి పరసారత్నం అన్నారు. తమిళనాడు తరహాలో దళితులు ఒక కమిటీగా ఏర్పడి ప్రతిఘటనకు సిద్ధపడకుంటే మరిన్ని దారుణ పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందని సత్యవేడు మాజీ ఎమ్మెల్యే సూరజ్ ఆందోళన వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో ఎంఆర్‌పీఎస్ నాయకుడు మధు, కుల వివక్ష పోరాట సమితి (కేవీపీఎస్) నేత శ్రీనివాసులు, లాయర్స్ అసోసియేషన్ నేత చల్లా వెంకటయ్య, కాంగ్రెస్ నగర కార్యదర్శి యార్లగోపి, టీటీడీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ మేడికొండ ప్రసాదరావు, అంబేడ్కర్ ఆర్మీ నేత గోపి, సీపీఎం నగర కార్యదర్శి వేణుగోపాల్, టీడీపీ నేత ఆముదాల తులసీరాం, ఏఎస్ పరమేశ్వరరావు, దళిత మహాసభ నేత ప్రభాకర్, మైనారిటీ సంఘ నాయకులు అమీర్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఆర్పీఐ) జిల్లా కార్యదర్శి సుబ్రమణ్యం, వీసీకే నేత రమేష్, పలు ప్రజా సంఘాలు, రాజకీయ పక్షాల నాయకులు పాల్గొన్నారు.

తీర్మానాలు

- పవన్‌కూ, బాధిత కుటుంబానికి అండగా నిలవాలి. తిరుపతిలో రాష్ట్ర సదస్సు చేపట్టి, అన్ని రాజకీయ పక్షాల నాయకులు, ప్రజా సంఘాల నాయకులను తీసుకురావాలి.
- నిరుపేద దళిత యువకుడి కుటుంబాన్ని జగన్మోహన్ రెడ్డి ఓదార్చాలి.
- తిరుపతిలో రౌడీయిజాన్ని రూపుమాపడానికి అందరూ ముందుకు రావాలి.

మొక్కు తీర్చుకున్న పట్టాభి

● కాలినడకన తిరుమలకు

తిరుపతి, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మొక్కు తీర్చుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కాలినడక తిరుమలకు వస్తానని మొక్కుకున్నారు. ఆ మేరకు శుక్రవారం కుటుంబ సమేతంగా అలిపిరి పాదాల మండపం నుంచి తిరుమలకు వెళ్లారు. జగనాసుర కబంధ హస్తాల నుంచి ఆంధ్రప్రదేశ్‌కు విముక్తి కలిగించి, కూటమి అధికారంలోకి రావాలని శ్రీవారిని వేడుకున్నానని ఈ సందర్భంగా పట్టాభి చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తిచేసుకున్న సందర్భంగా కాలినడకన తిరుమలకు వెళుతున్నట్టు తెలిపారు. శనివారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు. కాగా అలిపిరిలోని శ్రీవారి పాదాల మండపం వద్ద టీడీపీ నాయకులు వారికి స్వాగతం పలికారు. డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, కార్పొరేటర్లు నరసింహాచారి, నరేంద్ర, నాయకులు ఊట్ల సురేంద్ర నాయుడు, మహేష్ యాదవ్, మన్నెం శ్రీనివాసులు,కరాటే చంద్ర. ఎస్వీఎం శ్రీధర్, సుబ్బు యాదవ్ పాటకం వెంకటేష్, జిమ్ ప్రకాష్ స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.



అలిపిరి పాదాల మండపం వద్ద స్వాగతం పలుకుతున్న టీడీపీ నేతలు

తిరుమల ఘాట్‌రోడ్డులో జింక పిల్ల మృతి



తిరుమల, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే రెండవ ఘాట్‌రోడ్డులో శుక్రవారం ఓ జింక పిల్ల మృతి చెందింది. మార్గంలోని చివరి మలుపు వద్ద ఎలాంటి కదలికలు లేకుండా పడిఉన్న ఆరు నెలల వయసున్న జింకను చూసిన కొంతమంది వాహనదారులు విజిలెన్స్, అటవీ అధికారులకు సమాచారమిచ్చారు. అటవీ అధికారులు జింకను పరిశీలించి అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. శరీరంపై ఎలాంటి గాయాలు లేకపోవడంతో వాహనం ఢీకొనలేదని, కొండ పైభాగం నుంచి కిందపడి మృతి చెంది ఉండవచ్చని తెలియజేశారు.



కె.శ్రీనివాస్‌కు కేఎన్ జయమ్మ స్ఫూర్తి పురస్కార ప్రదానం

అమ్మను మించిన సామాజిక సంస్కర్త ఎవరూ లేరు

సామాజిక సాహిత్య విశ్లేషకులు కె.శ్రీనివాస్

పలమనేరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి):అమ్మను మించిన సామాజిక సంస్కర్త ఎవరూ లేరని ఆంధ్రజ్యోతి మాజీ సంపాదకులు,సామాజిక సాహిత్య విశ్లేషకులు డాక్టర్ కె.శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు.పలమనేరులో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన సాహితీ సభలో ఆయనకు కేఎన్ జయమ్మ స్ఫూర్తి పురస్కారాన్ని రచయిత పలమనేరు బాలాజి అందజేశారు.ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జయమ్మ కుమారుడిగా పలమనేరు బాలాజి ఏకలవ్య కాలనీ ఎరుకల కథల్లో తన తల్లి ఔన్నత్యాన్ని అక్షరీకరించి,ఆమెను చిరంజీవిగా నిలిపారన్నారు.తల్లిదండ్రులు మరణించినా వారి పేరున చేసే ఇటువంటి కార్యక్రమాలు వారిని సజీవంగా వుండేట్లు చేస్తాయన్నారు.ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్, రచయిత ఆర్.ఎం.ఉమామహేశ్వరరావు అధ్యక్షోపన్యాసం చేస్తూ ఆధిపత్య భావజాలాన్ని,దోపిడీ విధానాల్ని,సామాజిక అసమానతల్ని తన రచనల ద్వారా శ్రీనివాస్ ఎండగట్టారని ప్రశంసించారు.రచయితలు జి.వెంకట కృష్ణ, సుంకోజి దేవేంద్రాచారి,రాఘవ శర్మ, సహదేవనాయుడు, పేరూరు బాలసుబ్రమణ్యం,నెమిలేటి కిట్టన్న , బాబ్జీ, కొత్తపల్లి సురేష్, టీఎస్ఏ కృష్ణమూర్తి, జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, పల్లిపట్టు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.